09-04-2024
మంగళవారం
హైదరాబాద్

సంపుటి 26, సంచిక: 292
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00

Published from:
**Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


పాఠకులు,
ప్రకటనకర్తలు, ఏజెంట్లు,
శ్రేయోభిలాషులకు
'ప్రజాపక్షం' ఉగాది
శుభాకాంక్షలు



## సెలవు

ఉగాది సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి మంగళవారం సెలవు. బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

\- మేనేజర్


ప్రజా ఉద్యమ గొంతుకనవుతా 02
అందుబాటులో 14 కోట్ల గన్నీ సంచులు 02
4 నెలల్లో రూ.1177 కోట్ల విలువైన 'జీరో టికెట్లు' 02
చేనేత కార్మికుల జీవితాలతో బిఆర్‌ఎస్, బిజెపి ఆటలు 03




### కొడంగల్‌పై జరిగే కుట్రలను
# తిప్పికొట్టాలి

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 50 వేల మెజారిటీ తగ్గొద్దు : సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్‌ను దేశానికే ఆదర్శ వంతంగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతమంది వచ్చినా ఎన్ని కుట్రలు చేసినా నేను కొడంగల్ బిడ్డల గుండె చప్పుడేనని, తనను ప్రశ్నించేందుకు ఇక్కడి ప్రజలకు అధికారం, సర్వహక్కులు ఉన్నాయి అని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి 50 వేల మేజారిటీ తగ్గకుండా ఓట్లు వేసి కొడంగల్‌పై జరిగే కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నియోజకవర్గానికి మెడికల్ కాలేజ్,

తరువాయి 2లో

# కవితకు దక్కని ఊరట

మధ్యంతర బెయిల్ తిరస్కరించిన రౌస్ అవెన్యూ కోర్టు



**న్యూఢిల్లీ :** లిక్కర్ పాలసీ కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యంతర బెయిల్ తిరస్కరిస్తూ సోమవారం ఉదయం రౌస్ అవెన్యూ కోర్టు కాంప్లెక్స్‌లోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ విచారణ ఆలస్యం అవుతుండడంతో.. తన చిన్న కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ అయినా ఇవ్వాలంటూ కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తన కుమారుడికి పరీక్షలు ఉన్నాయని, ఈ సమయంలో పిల్లవాడికి తల్లి అవసరం ఉందని కవిత తరపున

తరువాయి 2లో







ప్రపంచం

# దక్షిణ గాజా నుండి వైదొలగిన ఇజ్రాయిల్ సైన్యం

## ఇరాన్ దాడుల హెచ్చరికతో నేతన్యాహూ అప్రమత్తం

## ఖాన్ యూనిస్‌కు తిరిగి వస్తున్న పాలస్తీనియన్లు



గాజా : ఎయిడ్ వర్కర్లపై దాడి ఘటన తర్వాత అంతర్జాతీయస్థాయిలో ఒత్తిడి పెరిగిన పర్యవసానంగా ఇజ్రాయిల్ అయిష్టంగానైనా కొన్ని చర్యలు తీసుకుంది. ఇందులోభాగంగా దక్షిణ గాజా నుండి సైన్యాన్ని ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. ఐతే ఒక్క బ్రిగేడియర్ సారథ్యంలోని సైనిక బృందాన్ని మాత్రం అక్కడే ఉంచింది. ఈ ఆకస్మిక నిర్ణయంతో అమెరికా కూడా ఆశ్చర్యపోయింది. సైన్యాన్ని ఆ ప్రాంతం నుండి వైదొలగడంతో పాలస్తినా ప్రజలు తిరిగి ఖాన్ యూనిస్‌కు రావడం ప్రారంభించారు. ఇజ్రాయిల్–హమాస్ మధ్య గత ఏడాది అక్టోబరు 7 వ తేదీ తర్వాత యుద్ధం నేపథ్యంలో ఇప్పటివరకూ జరిగిన సానుకూల పరిణామం ఇదే. దక్షిణ గాజా ప్రాంతం నుండి సైన్యాన్ని ఉపసంహరిస్తున్నామని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఐతే ఉత్తర గాజాలో మాత్రం గణనీయంగా తమ సైన్యాన్ని మోహరిస్తామని స్పష్టం చేసింది. గత ఏడాది నవంబరు నుండి బ్రాకూ ఇజ్రాయిల్ సైన్యం ఖాన్ యూనిస్ నగరంపైనే ప్రధానంగా దృష్టి సారించి నాశనం చేసింది. ఆరు నెలలుగా ఇజ్రాయిల్ సైన్యం ఖాన్ యూనిస్‌లో విధ్వంసం సృష్టిస్తూనే ఉంది. దీంతో దాదాపు ఆ నగరం నేలమట్టమైపోయింది. లక్షలాదిమంది ప్రజలు ఆ ప్రాంతం వదిలి పారిపోయారు. తమ దేశంపై ఇరాన్ ఏ క్షణంలోనైనా ప్రతీకార దాడులకు పాల్పడుతుందన్న ఉద్దేశంతో ఇజ్రాయిల్ సైన్యం అప్రమత్తంగా ఉంది. సిరియాలో ఇరాన్ దౌత్యకారాల్యంపై దాడిచేసి అపారమైన మానవ నష్టం చేసిన తర్వాత ఇరాన్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇజ్రాయెల్‌పై దాడికి సన్నద్ధమవుతున్నది. ఈ తరుణంలో ఇజ్రాయిల్ సైన్యం ఇరాన్ దాడులను ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఇరాన్‌ను ఎలా నిలువరించాలో తమకు తెలుసునని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది.

### అమెరికా దిగ్భ్రాంతి

దక్షిణ గాజా నుండి ఇజ్రాయిల్ తన సైన్యాన్ని ఉపసంహరించడంపట్ల అమెరికా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇప్పటివరకూ ఎంతగా చెప్పినా మొండితనంగా వ్యవహరించిన ఇజ్రాయిల్ ఆ ప్రాంతం నుండి సైన్యాన్ని ఉపసంహరించడంతో వైట్‌హౌస్ నేషనల్ సెక్యూరిటీ అధికార ప్రతినిధి జాన్ కిర్బి ఈ ఘటనను దిగ్భ్రాంతికరమైనదిగా పేర్కొన్నారు. ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలలో వ్యూహాలను మారుస్తామని ఆ దేశ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు వాగ్దానం చేశారని జాన్ కిర్బి గుర్తు చేశారు. మరోవైపు అంతర్జాతీయస్థాయిలో ఒత్తిడి కారణంగా కైరోలో ఇజ్రాయిల్ – హమాస్ మధ్య చర్చలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరణాల సంఖ్యను తగ్గించి నిర్మాణాత్మకమైన పద్ధతుల్లో నష్ట నివారణ చర్యలు తీసుకుంటేనే తదుపరి తాము అన్నివిధాలా అండగా ఉంటామని ఇజ్రాయిల్‌కు అమెరికా హెచ్చరిక చేసిన తర్వాత గాజాలోని యుద్ధ పరిస్థితుల్లో కొంత మేరకు మార్పులు వచ్చాయి. ఇదిలా ఉండగా తాము దక్షిణ గాజా నుండి సైన్యాన్ని ఉపసంహరించింది అంతర్జాతీయ ఒత్తిడివల్ల కాదని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ అన్నారు. తమదేశం యుద్ధంలో విజయానికి అతి సమీపంలో ఉందని చెప్పారు. బందీలను అందరినీ అప్పగించేవరకూ హమాస్‌ను వదిలేదని లేదని ఆయన అన్నారు.



## షార్జా హైరైజ్ బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం

## ఇద్దరు భారతీయులు సహా ఐదుగురు మృతి

**షార్జా :** షార్జాలోని ఒక బహుళ అంతస్తుల హైరైజ్ బిల్డింగ్‌లో గడచిన గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు భారతీయులు సహా ఐదుగురు మరణించారు. మరో 44 మంది గాయపడ్డారు. దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో సౌండ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మైఖేల్ సత్యదాస్ ఈ అగ్ని ప్రమాదంలో ఊరిపి ఆడక మరణించాడు. కొత్తగా వివాహం చేసుకుని అక్కడ స్థిరపడిన ఒక భారతీయ మహిళ కూడా మరణించారు. ఆమె భర్త ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో గాయపడినవారిలో 27 మందిని ఇప్పటికే విడుదల చేశారు. మైఖేల్ సత్యదాస్ ఎంతో నైపుణ్యంగల సౌండ్ ఇంజనీర్. ఆయన భారతదేశ ప్రముఖ దర్శకులు నిర్వహించే కార్యక్రమాలలో కీలక పాత్ర వహిస్తారు. ఈ విషయంపై ఆయన సోదరుడు ఒక ప్రకటన చేస్తూ ఎ.ఆర్.రెహ్మాన్, బ్రూనో మార్స్ వంటి గొప్పగొప్ప సంగీత దర్శకుల కార్యక్రమాలకు మైఖేల్ సత్యదాస్ అంత్యంత సమర్థుడైన సౌండ్ ఇంజనీర్‌గా తెరవెనుక పనిచేస్తూ ఆ కార్యక్రమాలకు వన్నె తెచ్చారని పేర్కొన్నారు. 750 అపార్ట్‌మెంట్లు ఉన్న ఈ సహదా అనే హై రైజ్ బిల్డింగ్ నుండి కెన్యాకు చెందిన ఒమనుయ గాడ్‌ఫ్రే షికండా (36) అనే వ్యక్తి ప్రాణాలు కాపాడుకోవాలనే ఆత్రతలో 30వ అంతస్తు నుండి కిందకు దూకి ప్రాణాలు విడిచాడు. షికండా ఒక పైపుల కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అర్థరాత్రి ఆకస్మికంగా పొగలు చుట్టుముట్టడంతో నిద్ర మెలకువ వచ్చిన షికండా అగ్నిప్రమాదంలో చిక్కుకున్నామని గ్రహించి 30వ అంతస్తులో ఉన్న కిటికీలోంచి కిందకు దూకేశాడు. షార్జా పోలీస్ కమాండర్ ఇన్ చీఫ్ మేజర్ జనరల్ సైఫ్ అల్ జరీ అల్ షంషీ సమాచారం ప్రకారం గురువారం రాత్రి 10.30 గంటలకు వ్యర్థ పదార్థాలు అంటుకుని వేగంగా మంటలు అన్ని ఫ్లోర్లకు వ్యాపించాయి. మొత్తం 39 అంతస్తులు ఈ హైరైజ్ బిల్డింగ్‌లో ఉన్నాయి. కాగా కెన్యాకు చెందిన మహిళ లాసా ఫోన్ కాల్ అందుకుని 26వ అంతస్తులో చిక్కుకున్న తన ఇద్దరు బిడ్డలను పైకి వెళ్ళి క్షేమంగా వారితో కిందికి వచ్చింది. పొగ అలుకుని ఉన్నప్పటికీ ఆమె సాహసం చేసి వెళ్ళి తన బిడ్డలనుతీసుకుని మెట్ల దారిలో 26 అంతస్తులు దిగి కిందికి చేరుకుంది.

## అణువిద్యుత్ కేంద్రంపై ఉక్రేన్ దాడి : రష్యా ఫిర్యాదు

**మాస్కో :** ఉక్రేన్ యుద్ధంలో రష్యా రెండేళ్ళక్రితం స్వాధీనం చేసుకున్న జపోరిఝియా అణువిద్యుత్ కేంద్రంపై డ్రోన్లతో దాడి జరిగింది. ఈ దాడికి ఉక్రేన్ కారణమని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ)కు రష్యా ఫిర్యాదు చేసింది. ఈ దాడి కారణంగా అంతపెద్ద ప్రమాదం వాటిల్లకపోయినప్పటికీ ఇది తీవ్రమైన అనుచిత చర్య అని స్పష్టం చేసింది. దీంతో అతర్జాతీయ అణు ఇంధన సంస్థ కూడా ఒక హెచ్చరిక చేస్తూ ఇలాంటి చర్యలకు ఎవరైనాగానీ చాలా దూరంగా ఉండాలని, అణువిద్యుత్ సంస్థ భద్రత అత్యంత ప్రధానమైన విషయమని పేర్కొంది. అణువిద్యుత్ కేంద్రం నుండి రేడియేషన్ తీవ్రస్థాయిలో విడుదల కాలేదని, రేడియేషన్ లెవెల్స్ సాధారణస్థాయిలోనే ఉన్నాయని కూడా రష్యా ప్రకటించింది.

## మొజాంబిక్‌లో పడవ మునిగి 94 మంది మృతి

**మాపుటో :** తూర్పు ఆఫ్రికాదేశం మొజాంబిక్‌లో ఒక పడవ సముద్రంలో మునిగి 94 మంది మరణించారు. మొజాంబిక్ తూర్పు తీరంలో చాలా ఎక్కువమంది పడవ ఎక్కడంతో మునిగిపోయింది. 130 మందిఈ పడవ ఎక్కారు. ఆదివారంనాడు ఈ ఘటన జరిగింది. కలరా భయంతో వీరంతా ఒక్కసారిగా పారిపోయేందుకు ప్రయత్నించారు. పడవ మునిగిపోవడంతో సుమారు 40 మంది తప్పించుకున్నారు. ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. నాంపులా రాష్ట్రంలోని ఒక దీవిలో ఈ ఘన జరిగింది. మృతుల్లో పిల్లలు కూడా ఎక్కువమంది ఉన్నారని అధికారులు చెప్పారు. నాంపులా నుండి వెళ్ళిపోయే క్రమంలో ఎక్కువమంది ఎక్కడంవల్ల బరువుకు పడవ మునిగిపోయిందనీ, వాస్తవానికి ఇది ప్రయాణికులను తీసుకువెళ్ళే పడవ కాదనీ, చేపలు పట్టే బోటును ఇలా ప్రయాణికులను ఒడ్డుకు చేర్చేందుకు అనధికారికంగా ఉపయోగిస్తున్నారనీ నాంపులా ప్రభుత్వ కార్యదర్శి జైమ్ నేతో చెప్పారు. కలరా వ్యాపించిందన్న తప్పుడు సమాచారం కారణంగా ఒక్కసారిగా జనం సముద్రం దాటి సురక్షిత ప్రదేశానికి వెళ్ళే ప్రయత్నం చేశారని అధికారి చెప్పారు. గత ఏడాది అక్టోబరు నుండి ఇప్పటివరకూ మొజాంబిక్‌లో 15,000 కలరా కేసులు నమోదయ్యాయి. ఈ కారణంగా 32 మందిమరణించారు. ఇప్పటివరకూ నాంపులా ప్రాంతంలోనే ఎక్కువగా కలరా కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా పొరుగున ఉత్తర కాబో డెల్గాడోలో ఇస్లామిక్ జీహదీలు దాడులు చేస్తున్న కారణంగా కూడా ప్రజలు భయంతో ఆ ప్రాంతం నుండి పారిపోతున్నారు.

## పాకిస్థాన్‌లో ఐదు బిలియన్ డాలర్లు సౌదీ పెట్టుబడులు

**అబుదాభీ :** పాకిస్థాన్‌లో ఐదు బిలియన్ డాలర్లు సౌదీ అరేబియా పెట్టుబడులుగా సమకూర్చే ప్రక్రియ వేగంగా పూర్తికానున్నది. సౌదీ అరేబియాలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాస్ షరీఫ్ ఆదివారం సౌదీ రాజుతో సమావేశమయ్యారు. ఈ సమావేశం వివరాలను ఒక సంయుక్త ప్రకటనలో విడుదల చేశారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టాక షెహబాజ్ షరీఫ్ మొదటిసారి సౌదీ అరేబియాలో విదేశీ పర్యటన చేశారు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉండటంతో పరిస్థితిని చక్కదిద్దడం కొత్త ప్రభుత్వానికి సవా లుగా మారింది. ఇందుకోసమే జరిపే ప్రయత్నాల్లో భాగం గా షెహబాజ్ షరీఫ్ సౌదీరాజును కలిశారు. సౌదీ డవలప్‌మెంట్ ఫండ్ నుండి పాకిస్థాన్‌కు ఇచ్చే నిధిని ఐదు బిలియన్ డాలర్లకు పెంచే విషయంపై ఆర్థికపరమై న సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయయాలని సౌదీ రాజు గత ఏడాది జనవరిలోనే ఆదేశించారు. ఐతే ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రధానమంత్రి సౌదీ రాజును కలిసి ఈ విషయం ప్రస్తావించారు. రాబోయే రెండేళ్ళ కాలంలో సౌదీ అరేబియా పాతిక బిలియన్ డాలర్లు పాకిస్థాన్‌లో పెట్టుబడులు గా సమకూరుస్తుందని పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రి అన్వరుల్ హక్ కాకర్ గత ఏడాది సెప్టెంబరులో చెప్పారు వ్యవసాయం, గనులు, సాంకేతిక రంగాలలో సౌదీ అరేబియా ఈ పెట్టుబడులు పెడుతుంది.



## అందుబాటులో 14కోట్ల గన్నీ సంచులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. ప్రస్తుత సీజన్‌లో మొత్తం 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా, ఇప్పటికే 5422 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభ మయ్యాయి. మిగతా 1727 కేంద్రాలు మరో రెండు రోజుల్లో తెరిచేందుకు వ్యవసాయశాఖ సన్నద్ధమైంది.అయిదు జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా 443 కొనుగోలు కేంద్రాల్లో 4345 మంది రైతుల నుంచి 31,215 మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోళ్లు జరిగాయి.ప్రస్తుత ఏడాది దాదాపు 75.40 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోళ్లు జరుగుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా వడ్ల సేకరణకు 18.85 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పటికే 14 కోట్ల గన్నీ సంచులను అందుబాటులో తీసుకొచ్చింది. దాదాపు 56 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోళ్లకు ఇవి సరిపోతాయి. మిగతావి వీలైనంత తొందరగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. గతేడాది ఇదే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కూడా కాలేదని, కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ముందుగానే ప్రారంభించింది. మార్చి చివరి వారం (25వ తేదీ) నుంచే సెంటర్లు ప్రారంభమయ్యాయి.

## నాలుగు నెలల్లో రూ. 1177కోట్ల విలువైన 'జీరో టికెట్లు'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన "మహాలక్ష్మి" కి విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకాన్ని ప్రారంభించిన నాలుగు నెల్లోనే ( ఏప్రిల్ 7వ తేదీ వరకు) రూ. 1177 కోట్ల విలువైన 'జీరో టికెట్ల'ను ఆర్‌టిసి జారీ చేసింది. మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు మహిళలు టికెట్ల రూపంలో సుమారు రూ.1177 కోట్లను ఆదా చేశారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి ఆర్‌టిసిలో మహిళా ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగోతంది. మహాలక్ష్మి ప్రారంభమైన మొదట్లో ప్రతి రోజూ సగటున 14 లక్షల మంది మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ఆ తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ, సగటున రోజుకు 29.67 లక్షల మంది ఆర్‌టిసిలో బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. కాగా ప్రతి రోజూ సగటున డిసెంబర్‌లో 26.99 లక్షలు, జనవరిలో 28.10 లక్షలు, ఫిబ్రవరిలో 30.56 లక్షలు, మార్చిలో 31.42 లక్షల మంది మహిళలు ఉచిత టికెట్‌పై ప్రయాణించినట్టు ఆర్‌టిసి వెల్లడించింది. హైదరాబాద్ లో సుమారు 6 లక్షల మంది మహిళలు రోజూ సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్టు ఆర్‌టిసి వర్గాలు పేర్కొన్నాయి.

## కరువుపై బిఆర్‌ఎస్ దిగజారుడు ఆరోపణలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎండాకాలం కరువుపై కాంగ్రెస్ ప్రభుత్వంపైన బిఆర్‌ఎస్ రోజు రోజుకూ దిగజారి ఆరోపణలు చేస్తోందని టిపిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రస్తుత కరువుకు కారణం కాంగ్రెస్ కాదని, బిఆర్‌ఎస్ కట్టిన ప్రాజెక్టులే కారణమని ఆరోపించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించి, కోటి ఎకరాలకు నీళ్లు ఇస్తామన్న గత బిఆర్ఎస్ ప్రభుత్వ కక్కుర్తి వల్లనే ఆ ప్రాజెక్ట్ కూలి పోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే ప్రస్తుతం కరువు నుండి తెలంగాణ బయట పడుతోందన్నారు. కెసిఆర్ పదేళ్ల పరిపాలన కారణగా రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని, తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్‌ను కనుమరుగు లేకుండా చేయాలని ఆయన ప్రజలు కోరారు.

# ప్రజా ఉద్యమ గొంతుకనవుతా

## ప్రజా తోడ్పాటు మరువ లేనిది

## ఆత్మీయ సమావేశంలో కూనంనేని



**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాసన సభలో కమ్యూనిస్టు పక్షాన ఏకైక శాసన సభ్యుడినైనా ప్రజా గొంతుకగా పని చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం నియోజక వర్గంలో గెలుపు కోసం అనేక మంది వివిధ రూపాలలో తోడ్పాటు నందించారని ఆ తోడ్పాటు మరువలేనిదన్నారు. స్థానిక ఎస్ పార్కు హోటల్‌లో కూనంనేని ఆత్మీయులతో సమావేశం నిర్వహించారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గరికపాటి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిజం అంతమవుతుందని, కమ్యూనిస్టు పార్టీలకు మనుగడ లేదని కొందరు ప్రచారం చేస్తున్నారని కొత్తగూడెం నుంచి తాను సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు కమ్యూనిస్టు వ్యతిరేకులు సైతం తాను గెలవాలని ఆకాంక్షించారని ఆయన తెలిపారు. పలు విధాలుగా సహాయ సహకరాలను అందించారని తన గెలుపును వారి గెలుపుగా భావించారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యాపార, రాజకీయ, ఉద్యోగులలో కమ్యూనిస్టు వ్యతిరేకత అంతగా కనపడదని ఏ పార్టీలో ఉన్నా కమ్యూనిస్టులు మంచిని కోరుకుంటారని కూనంనేని తెలిపారు. పంచభూతాలు ఉన్నంత కాలం, ఈ భూమిపై మనిషి మనుగడ ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీల అవసరం ఉంటుందని, కమ్యూనిస్టుల అవసరం ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరాలన్న, హక్కులు రక్షించబడాలన్న కమ్యూనిస్టుల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీల విస్తరణకు కృషి చేస్తానని భవిష్యత్తులో ఒక్క స్థానం కాకుండా అనేక గొంతుకలు చట్ట సభలలో వినిపించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఎన్నికలలో ధన ప్రభావం పెరిగి పోయిందని అందుకే దామాషా ప్రతిపాదికన ఎన్నికలు నిర్వహించాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రం మొత్తంలో కమ్యూనిస్టు పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని కూనంనేని తెలిపారు. పలు సందర్భాలలో, పలు ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో డాక్టర్ వై. ప్రసాద్, ఐఎల్ నాయకులు పోట్ల మాధవరావు, పి. పట్టాబి, ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ రావు, కార్యదర్శి జగదీష్, చైతన్య విద్యా సంస్థల బాధ్యులు శ్రీధర్, వివిధ వర్గాల ప్రముఖులు రాకేష్, బత్తినేని నీరజ, గుర్రం ఉమామహేశ్వరరావు, డాక్టర్ కిషన్, శేషగిరి, లతీఫ్, రెజొనెన్స్ నాగేంద్రకుమార్, శ్రీనివాస్, బా లాజీ రవి ప్రసంగించగా సిపిఐ నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, ఎస్‌కె సాబీర్ పాషా, మహ్మద్ మౌలానా, దండి సురేష్, వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేనిని పలువురు పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.

**ప్రజాప్రతినిధులు ప్రజల సేవ కోసం పని చేయాలి**

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం పనిచేయాలని ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం నూతనంగా ఎన్నికైన ఎంపీపీ గా ఎన్నికైన సిపిఐ అభ్యర్థి భూక్య పద్మావతిని ఎన్నికకు సహకరించిన ఎంపీటీసీలను శాలువాలతో మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ గల పార్టీగా సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని ప్రజల కోసం వారి అభివృద్ధి కోసం మరింతగా కృషి చేస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో సిపిఐ మరింత బలపడుతుందని రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ని ప్రజల ఆదరిస్తున్నారని వారు అన్నారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మాట్లాడుతూ 2019 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఐ పొత్తులో భాగంగా జడ్పిటిసి గా కాంగ్రెస్ అభ్యర్థిని సిపిఐ అభ్యర్థిగా ఎంపీపీ కావాలని కోరారు. కొన్ని వారి కారణాలవల్ల ఆనాడు జరగకపోయినా ఇప్పుడు కాంగ్రెస్ ఎంపీటీసీలు బలపరచడంతో సిపిఐ అభ్యర్థి భూక్య పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు.

## కొడంగల్‌పై జరిగే కుట్రలను తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

వెటర్నరీ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్, నర్సింగ్, ప్రభుత్వ మహిళ డిగ్రీకాలేజీలతో పాటు రూ.4 వేల కోట్లతో నారాయణ పేట –కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకువచ్చామన్నారు. కొడంగల్‌లోని తన నివాసంలో సోమవారం నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ ముఖ్యనాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 730 నిమిషాల వరకు సుదీర్ఘంగా మంతనాలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఎంపి స్థానానికి ప్రతి బూత్ నుంచి మేజారిటీ తీసుకురావాల్సిన బాధ్యత మండల నాయకులపై ఉందని, అందుకు వారికి తగిన సలహాలు, సూచనలు అందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తల సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గత 60 ఏళ్ల నుంచి ఈ నియోజకవర్గం నుంచి కనీసం మంత్రిగా కూడా ఎవ్వరికీ అవకాశం రాలేదని, కానీ సోనియాగాంధీ, మల్లీకార్జున్ ఖర్గే కృషి వల్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శాసించే అధికారం మనకు వచ్చిందని అన్నారు. ఈ పదవి తనది కాదని, ఇది కొడంగల్ ప్రజల కష్టమేనని ఆయన వ్యాఖ్యానించారు. కొడంగల్‌లో కాంగ్రెస్‌ను ఓడించి రేవంత్‌రెడ్డిని కిందపడేయాలని కొందరు కుట్రలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎందుకు రేవంత్‌రెడ్డిని కిందపడేయాలని ప్రశ్నించారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ బిఆర్‌ఎస్‌తో చేతులు కలిపి కొడంగల్‌ను అభివృద్ధి చేయనీయకుండా కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను చూసి ఓర్వలేక మతాల పేరు చెప్పుకుని కులాల మధ్య చిచ్చు పెడుతున్న అరుణమ్మకు తగిన గుణపాఠం చెప్పాలని రేవంత్‌రెడ్డి కోరారు. పదేళ్లు ప్రధానిగా మోడీకి ఓట్లు వేస్తే చంద్రమండలానికి రాజవుతారా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్లమెంట్ ఎంపి అభ్యర్థి చల్లా వంశిచంద్‌రెడ్డి, నాయకులు ఎస్.ఎ.సంపత్‌కుమార్, రేవంత్‌రెడ్డి సొదరుడు తిరుపతి రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్‌తో పాటు వివిధ మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోని ల్యాండ్ క్రూయిజర్ కారు టైర్ పంక్చర్ అయి పేలింది. కారు సడెన్‌గా ఆగిపోవడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళుతుండగా వికారాబాద్ జిల్లా మన్నెగూడ వద్ద కాన్వాయ్‌లోని ఒక ల్యాండ్ క్రూయిజర్ కారు టైర్ పంక్చర్ అయి పేలిపోయింది. వెంటనే అప్రమత్తమైన కారు డ్రైవర్ కారును పక్కకు మలిపి నిలిపివేశారు. ముఖ్యమంత్రి మరోక కారులో ఉండడంతో కాన్వాయ్ ముందుకు సాగింది. ముఖ్యమంత్రి కొడంగల్‌లో మండలాలవారీగా కాంగ్రెస్ నేతలతో సమావేశం కానున్నారు. ఇందుకోసం ఆయన కొడంగల్ వెళ్తున్నారు. కారు టైర్ పంచర్ అయిన ఘటనలో కాన్వాయ్‌లోని వారికి ఎవరికీ ఏమీ కాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## కవితకు దక్కని ఊరట

(మొదటి పేజీ తరువాయి)

అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పరీక్షల నేపథ్యంలో బెయిల్ ఇవ్వానలి కోరారు. అయితే ఇప్పటికే ఆమె కుమారుడికి ఏడు పరీక్షలు పూర్తి అయ్యాయని, ఇప్పుడు బెయిల్ అవసరం లేదని కోర్టుకు ఇడి తెలిపింది. పైగా కవిత రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి అని, అలాంటి వ్యక్తి బయటకు వస్తే ఈ కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టులో వాదనలు వినిపించింది. ఈ క్రమంలో 4వ తేదీన వాదనలు ముగియగా.. తీర్పు రిజర్వ్ చేసి తీర్పు నేటికి వాయిదా వేశారు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ భవేజా. ఇడి వాదనలతో ఏకీభవిస్తూ సోమవారం మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. కవితకు ఇడి నోటీసులు ఇచ్చిన తర్వాత తన ఫోన్లో డాటాను ధ్వంసం చేశారని, ఫోరెన్సిక్ నివేదికలో ఈ విషయం నిర్ధారణ జరిగినట్లు జడ్జి వెల్లడించారు. 'బెయిల్ ఇస్తే ఆమె సాక్షులను ప్రభావితం చేయగలరు. బెయిల్ ఇవ్వడానికి ట్రిపుల్ టెస్ట్ పాస్ కాలేదు. కవిత కుమారుడి వయసు 16 సంవత్సరాలు. ఇప్పటికే సగం పరీక్షలు పూర్తయ్యాయి. తండ్రి , పిన్ని తగినంత మానసిక ధైర్యం కుమారుడికి కల్పిస్తారు. పరీక్షల భయం మధ్యంతర బెయిల్‌కు తగిన కారణం కాదు. తల్లిదండ్రులు భౌతికంగా అందుబాటులో లేకున్నా, 19 ఏళ్ల కుమారుడు స్పెయిన్‌లో చదువుకుంటున్నాడు. చిన్న కుమారుడు తండ్రి , పిన్ని సమక్షంలో చదువుకోవడానికి, పరీక్షలు రాయడానికి ఇబ్బంది ఏమీ ఉండదు. మహిళ అనే కారణంతో బెయిల్ ఇవ్వాలన్న అంశంపై కోర్టులు అన్ని అంశాలు పరిగణలోకి తీసుకొని జాగ్రత్తగా వ్యవహరించాలి. నేరాలలో బలి కావడానికి కవిత నిస్సహాయు రాయులైన మహిళ కాదు. కవిత సమాజంలో ఉన్నత స్థానంలోని విద్యావంతురాలు. సాక్షులను బెదిరించడం, సాక్ష్యాలను ధ్వంసం చేయడంలో కవిత క్రియాశీల పాత్ర పోషించారని దానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళ అయినంత మాత్రాన పీఎంఎల్‌ఏ సెక్షన్ 45 (1) కింద బెయిల్ ఇవ్వలేం అందుకే కవిత బెయిల్ పిటిషన్ తిరస్కరిస్తున్నా' అని జడ్జి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. లిక్కర్ పాలసీ కేసులో అరెస్టైన కవిత మార్చి 26వ తేదీ నుంచి కవిత తీహార్ జైల్లో ఉన్నారు. కవితకు కోర్టు విధించిన 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగియనుంది. సోమవారం కవితకు మధ్యంతర బెయిల్ నిరాకరించడంతో.. మంగళవారం మళ్లీ కోర్టు ముందు హాజరుపరుస్తారు. మరోవైపు.. కవిత సాధారణ బెయిల్ పిటిషన్‌పై మాత్రం ఈ నెల 20న ఇరుపక్షాల వాదనలు వింటామని కోర్టు ఇదివరకే స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ పిటిషన్‌ను త్వరగతిన విచారణ చేప్పాలంటూ ఆమె కోర్టును ఆశ్రయిస్తూ మరో పిటిషన్ వేయనున్నట్లు తెలుస్తోంది.

# చేనేత కార్మికుల జీవితాలతో బిఆర్ఎస్, బిజెపి ఆటలు

సిరిసిల్ల మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : నేతన్నల జీవితాలతో బిఆర్ఎస్, బిజెపి రాజకీయ ఆట ఆడుతున్నాయని, నేతన్నల పేరుతో శవ రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే ఎజండాగా పెట్టుకున్నాయని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర సంక్షోభ పరిస్థితులపై సోమవారం మధ్యాహ్నం సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కెకె మహేందర్ రెడ్డిలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు నేతన్నలపై శవ రాజకీయాలు మెరుపుతున్న సంఘటనలపై ప్రజలకు, నేతన్నలకు వాస్తవాలను తెలియజెప్పడం కోసమే సిరిసిల్లలో మీడియా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు పార్టీలు గత పదేళ్లుగా అధికారంలో ఉన్నాయని, తాము అధికారంలోకి వచ్చి కేవలం నాలుగు నెలలు మాత్రమే అయ్యిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేతన్నల ప్రయోజనం కోసం నిర్ణయాలు తీసుకున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. బిజెపి ప్రభుత్వం వస్త్రాలపై 12 శాతం జిఎస్‌టిని విధించి నేతన్నల నడ్డి విరిచిందని, ఈ రంగాన్ని అనేక విధాలుగా వేధింపులకు గురి చేసిందన్నారు. అనేక జాతీయ పథకాలను రద్దు చేసిందని, బుల్కర్ బీమా, ఐసిఐసిఐ ఆరోగ్య భీమా, హౌస్ కం వర్క్ షెడ్ పథకాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే సిరిసిల్ల నంబర్ వన్ గా ఉండేదని, మాజీ ఎంపి తన ప్రాంతానికి చెందిన వరంగల్ కు మెగా టెక్స్‌టైల్ క్లస్టర్ ను తీసుకెళ్లాడని, సిరిసిల్లకి ఇవ్వాలని తాము కోరినప్పటికీ ఆనాడు నోరెత్తని ప్రస్తుత ఎంపి బండి ఏ ముఖం పెట్టుకొని దీక్ష అంటున్నాడని ప్రశ్నించారు. నేత వృత్తి పరమైన అంశం ఆయనకు ఏమీ తెలవదని, కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, ఎస్ఐడిపి కింద రూ.350 కోట్లు రావాల్సి ఉండగా 25 శాతం రాష్ట్ర వాటా పోగా ఇందులో 50 శాతం నిధులు కూడా తేలేకపోయాడన్నా రు. ఇక మాజీ మంత్రి కెటిఆర్ రూ.558కోట్లు అప్పు పెట్టి పోయాడని ఈ పాపం ఎవరిదని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

నేతన్నల సమస్యపై కెటిఆర్ కు తాపత్రయం లేదని, రూ.558 కోట్లు బకాయిలు పెట్టాడని ఇందులో రూ.352 కోట్లు బతుకమ్మ చీరల అప్పు అని 2016–17 నుండి ఈ అప్పులు పెరుగుతూ వస్తున్నా ఎందుకు చెల్లించలేదని, ముఖ్యమంత్రిగా మీ నాయన ఉన్నాడు కదా అని మంత్రి ప్రశ్నించారు.

తాము నాలుగు నెలల్లోనే రూ.120 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని మంత్రి స్పష్టం చేశారు. నేతన్నలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని, నేతన్నల సంక్షేమం కోసం ఎవరికి కష్టం రాకుండా చూసే బాధ్యత మాదేనన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల కంటే ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక రూపాయి ఎక్కువగానే ఇస్తామని, బకాయలు అన్ని తీరుస్తామని, నేతన్నలు నిరాశ పడవద్దన్నారు. 7 లక్షల కోట్ల బాకీలు భరిస్తున్న తమ ప్రభుత్వం నేతన్నల బకాయిలు కూడా చెల్లిస్తామని, మొదటి దశ కింద కొంత బకాయలు, రెండవ దశలో మిగిలిన బకాయలు చెల్లిస్తామని, ఇది కాంగ్రెస్ ఇస్తున్న మాట తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మాట అని అన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సిరిసిల్లపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బిజెపిని గద్దె దించటానికి సమరశంఖం పూరించాలి

## శ్రామిక వర్గానికి ఎఐటియుసి రాష్ట్ర సమితి పిలుపు




ప్రజాపక్షం / హైదరాబాద్: ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించటానికి సమరశంఖం పూరించాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి శ్రామిక వర్గానికి పిలుపునిచ్చింది. ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ అధ్యక్షతన హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది.

సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ 1991లో తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరుగుతూ వారికి అనుకూల విధానాలను చేపడుతున్నారని విమర్శించారు. ఫలితంగా ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్ వారికి అప్పగించడం, ఆ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత, కనీస వేతనాలు లేని దుర్భర పరిస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నారని, 44 కార్మిక చట్టాలను సవరించటం కారణంగా సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ ఉపాధి భద్రతలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగపరుస్తూ ప్రతిపక్ష పార్టీల పైన, నాయకుల పైన ఈడి, ఐటి, సిబిఐ ఉపయోగిస్తూ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పరిపాలన యంత్రాంగాన్ని నడిపిస్తూ మూడోసారి అధికారంలోనికి రావాలని ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా యావత్ కార్మి కవర్గం ఏకమై రానున్న ఎన్నికల్లో 'బిజెపి హటావో దేశ్‌కో బచావో' నినాదంతో ప్రత్యామ్నాయంగా 17 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి, లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి అనేక వాగ్దానాలు చేసి అమలు చేయలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వాటి అమలుకు ఆదేశాలు ఇవ్వాలని సమావేశంలో డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ''పెరుగుతున్న ధరలకు అనుకూలంగా 75 షెడ్యూల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్‌లలో కనీస వేతనాలను సవరించి అమలు చేయాలి. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన 3 డిఎల ను విడుదల చేయాలి. నూతన పిఆర్‌సి అమలు చేయాలి. గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే విడుదల చేయాలి. సింగరేణిలో కార్మికుల గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)ను వెంటనే కార్మిక శాఖ ధృవీకరణ పత్రాన్ని ఇవ్వాలి. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీన చేసి న నేపథ్యంలో వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా ఇచ్చే సదుపాయాలన్ని కల్పించాలి.

వివిధ ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న 2.5 లక్షల మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయా లి. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులందరికీ ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ కింద పక్కా గృహ నిర్మాణాలను మంజూరు చేయాలి'' అని సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఉపాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రేమ్ పావని, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్యదర్శులు ఎస్.విలాస్, సింగు నరసింహారావు, పల్లా దేవేందర్‌రెడ్డి, ఓరుగంటి యాదయ్య, కరుణకుమారి, బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# వంశీకృష్ణను గెలిపించుకోవాలి

## రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను దేశంలోనే రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం రామగుండం ఎంఎల్‌ఎ రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆధ్వర్యంలో పెద్దపల్లిపార్లమెంట్ సన్నాహక సభలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణను ఎంఎల్ ఎ మక్కాన్ సింగ్ బలపర్చారంటే ఆయన గెలుపు ఖాయ మని అర్థం అన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు ఎంఎల్ ఎ మక్కాన్ సింగ్ అని, ఆయనతో పాటు ఎంపిగా వంశీకృష్ణ విజయం సాధిస్తే రామగుండం నియోజకవర్గ రూపు రేఖలు మారిపోతాయని అన్నా రు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, ఆ తర్వాత రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని టి–హబ్‌గా తీర్చి దిద్దుతామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఠాకూర్ మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ గడ్డం ఫ్యామిలీకి అడ్డా అని, ఆనాడు దివంగత కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి నుంచి ప్రస్తుత ఎంఎల్‌ఎ వివేక్ వరకు పెద్దపల్లి ఎంపిలుగా విజయం సాధించి ఈ ప్రాంతానికి ఎనలేని సేవలు చేశారన్నారు. అదే విధంగా ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణ గెలుపుతో మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నా రు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఎంఎల్‌ఎలు ప్రేమ్‌సాగర్, వివేక్, వినోద్, విజయరమణారావుతో పాటు పార్టీశ్రేణులు, ప్రజాప్రతినిధులు, తదితరు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మళ్లీ మోడీ వస్తే ప్రమాదంలో ప్రజాస్వామ్యం

## ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో యువతను, విద్యార్థులను మోసం చేసిన బిజెపి, బిఆర్ఎస్ ను ఓడిద్దామని, బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులకు ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని, బిజెపి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం బిజెపి మతోన్మాద ఆటను తీవ్రతరం చేస్తోందని, మత విద్వేషాలు రెచ్చగొట్టి మూడవసారి అధికారంలోకి వచ్చేందుకు పావులు కదుపుతోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400సీట్లిస్తే రాజ్యాంగాన్ని హిందువులకు అనుకూలంగా మార్చేస్తాం అంటూ మతాల మధ్య చిచ్చురేపే ప్రకటనలను బిజెపి నాయకులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు రాజకీయాలను అంటకడుతోందన్నారు.

బిజెపి పూర్తి మెజార్టీతో అధికారంలోకి వస్తే హిడెన్ ఎజెండాగా మనుస్మృతి అమలు పార్లమెంటరీ వ్యవస్థలో ద్విసభా విధానానికి బదులుగా త్రిసభ విధానం సాధువులు, సన్యాసులతో అత్యున్నత సభగా గురుసభ ఏర్పాటు చేయడానికి దుష్ట పన్నాగాలు పన్నుతున్నారని, ఎన్నికలకు ముందు సిఎఎ అమలు చేయడమే అందుకు నిదర్శనమన్నారు. యువతను, విద్యార్థులను మోసం చేయడంలో బిజెపి, బిఆర్ఎస్‌లు సిద్ధహస్తులయ్యారని విమర్శించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సమగ్ర యువజన విధానాన్ని అమలు చేయాలని, అందరికీ విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేస్తున్న మోడీను గద్దె దింపుదామని, మత విద్వేషాలు రెచ్చగొడుతున్న ఆర్ఎస్ఎస్, బిజెపి రాజకీయాలను ఎండగడదామని, పౌర హక్కులు కాలరాస్తూ సిబిఐ, ఇడిలను రాజకీయాలను స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్న బిజెపికి వ్యతిరేకంగా పోరాడుదామని, ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బతీస్తున్న దళిత, మైనారిటీ, ఆదివాసీ, మహిళా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న మోడీ, షాలను ఓడిద్దామని, విభజన హామీలను నెరవేర్చని మోడీని ఓడించాలన్నారు.ఎఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి మానస్ కుమార్, మార్కపూరి సూర్యలు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులకు అన్ని రకాలుగా అన్యాయం చేసిందని, బిజెపి, బిఆర్ఎస్ రెండూ ఒకటేనని అందుకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారన్నారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి మానస్ కుమార్, మార్కపూరి సూర్య రాష్ట్ర సమితి సభ్యులు తాళ్లపల్లి సురేందర్, జిల్లా సమితి సభ్యులు ఆసాల నవీన్, సాదుల శివ, దుర్గం విజయ్ కుమార్, గోషిక పవన్, ప్రీతమ్, రానవేణి సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

## సమ్మెకాలం వేతనం వెంటనే చెల్లించాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రాథమిక పాఠశాలలకు ఇస్తున్న మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని, సమ్మెకాలం 24 రోజుల వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ డైరక్టర్, అధికారులను సోమవారం కలిసి వినతి పత్రం అందచేశారు.

గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి హరీశ్ రావు ఆధ్వర్యంలో ఎఐటియుసి నాయకత్వంలో చాడ వెంకట్ రెడ్డి సమక్షంలో జరిగిన ఒప్పందం అంశాలను అమలు చేయాలని కోరారు. రిటైర్డ్‌మెంట్ అయిన వారికి రూ.10 లక్షలు, టీచర్, ఆయాలకి రూ.5 లక్షలు చెల్లించాలని, 30 రోజుల వేసవి సెలవులు ఇవ్వాలని, మార్చి నెల వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్‌లపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వంతో చర్చించిన అనంతరం తెలుపుతామని అధికారులు చెప్పారని చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. వేతనం వెంటనే విడుదల అవుతుందని తెలిపారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ప్రాథమిక పాఠశాలలకు ఇచ్చే విధంగా సెలవులు వర్తింప చేసి, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు హోం రేషన్ ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం సెప్టెంబర్ 11వ తేదీ నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై 24 రోజులు సమ్మె చేయడం జరిగిందన్నారు. ఈ 24 రోజుల వేతనాలు వెంటనే చెల్లించాలని, ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు, సెంటర్ అద్దెలు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని కోరినట్లు చెప్పారు.

రిటైర్‌మెంట్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని పోరాటం నిర్వహించామన్నారు.

ఈ సందర్భంలో గత ప్రభుత్వం టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.1 లక్ష ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.

ప్రస్తుతం విడుదల చేసిన సర్క్యులర్ 65 సంవత్సరాలు నిండిన వారికి అంగన్‌వాడీ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు చెల్లించేటట్లు జి.ఓ సవరించి, విడుదల చేయాలని కోరినట్లు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు.

ఈ సమావేశంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణ కుమారి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ తదితరులు హాజరయ్యారు.

# రాష్ట్ర ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలన్నీ నెరవేరాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, రైతులు, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆయన అభిలషించారు. నూతన సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి శ్రీ క్రోధి నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



















ప్రజాపక్షం

మంగళవారం, ఏప్రిల్ 09

# ఎన్ని'కలల' ఉగాది

అరవై తెలుగు సంవత్సరాల చక్రగతిలో మరో నూతన సంవత్సర వేడుక ఈ ఉగాది – క్రోధి నామ సంవత్సరం, చైత్ర బహుళ సప్తమి మంగళవారం ఆరంభమవుతోంది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, గోవాల్లో కూడా ఈ నూతన సంవత్సరారంభాన్ని పండగగా జరుపుకుంటారు. సువిశాల భారతదేశంలో ఎన్నో జాతులు, ఉపజాతులున్నందున ఎవరికి వారు తమ జాతి సాంప్రదాయకతను బట్టి తమ నూతన సంవత్సరం జరుపుకుంటారు. ప్రధానంగా కొన్ని జాతులు సూర్యమానాన్ని, మరికొన్ని జాతులు చంద్రమానాన్ని అనుసరిస్తూ యుగాదిని, ఆ ప్రాతిపదికగా పండితులు రూపొందించిన క్యాలెండర్‌ను పాటిస్తుంటారు పంచాంగ శ్రవణం ప్రత్యేకత. మహారాష్ట్రలో మన ఉగాది రోజునే 'గుడి పడవా' పేరుతో పండగ చేసుకుంటారు. (దీని నేపథ్యం, ఆచరణను దిగువ వ్యాసంలో తెలుసుకోవచ్చు). భారతీయులందరూ ఒకే జాతి కాదని, అందువల్ల భిన్నత్వంలో ఏకత్వం దాని సమైక్యత, సమగ్రతలకు ప్రాణప్రదమని భావించబడుతోంది. అయితే హిందువులందర్నీ ఏకజాతిగా గుదిగుచ్చి హిందూత్వ పేరుతో వారి ఆధిపత్య స్థాపనకోసం ప్రయత్నిస్తున్న మనువాద శక్తులు దూరదృష్టితో లిఖించబడిన భారత రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారు. ఈ సందర్భంలో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. వరుసగా మూడవసారి అధికారం – అదీ పరిపూర్ణ మెజారిటీతో సాధించి హిందూత్వ ఎజండా అమలులో అసంపూర్ణ ఎజండాను అమలు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ పరివారంలో రాజకీయ విభాగమైన భారతీయ జనతాపార్టీ పథకాలు రచించింది, వాటి సాధనకు అవిరామ కృషి చేస్తోంది. ప్రతిపక్షాలను అణగదొక్కటానికి అది ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను బరితెగించి దుర్వినియోగం చేయటంతోపాటు ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా రోజుకో అబద్ధం ప్రచారంలో పెడుతోంది. మత విభజన ధ్యేయంగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పాట పాడుతోంది. అత్యధిక ప్రతిపక్ష పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడి ఈ రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, లౌకిక వ్యతిరేక ఛాందసవాద ప్రభుత్వాన్ని గద్దెదించాలనే సంకల్పంతో ఢీకొంటున్నాయి. ఉగాది పండగ తెలుగువారిదే అయినప్పటికీ ఈ సమయంలో దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల్లో యావద్దేశం మునిగి ఉన్నందున ఈ క్రోధినామ సంవత్సర ఉగాది ప్రత్యేకతను సంతరించుకుంది.

'తెలుగుజాతి మనది – నిండుగ వెలుగు జాతి మనది' అని గర్వంగా పాడుకున్న తెలుగు ప్రజలు చారిత్రక కారణాలరీత్యా, పాలకుల తప్పిదాలవల్ల రెండు రాష్ట్రాలుగా విడిపోయి దశాబ్దం గడుస్తున్నది. సాంస్కృతిక వారసత్వంలో వైవిధ్యాలనుబట్టి తెలంగాణలో బతుకమ్మ, బోనాలు వంటి ఉత్సవాలు వైభవంగా జరుపుకుంటారు. అయినా తెలుగుజాతి అంతరాలు ఒకటే అన్నట్లు సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి వంటివాటిని అందరూ జరుపుకుంటారు. పాశ్చాత్య సంస్కృతి జాతి, మతాలకు అతీతంగా యువతరాన్ని ఆవహిస్తున్నది. దీన్ని తట్టుకుని ఆయా జాతులు తమ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకోవాలి, భవిష్యత్ తరాలకు అందించాలి.

రెండు తెలుగు రాష్ట్రాలు ఈ ఉగాది సందర్భంలో ఎన్నికల్లో తలమున్కలుగా ఉన్నాయి. తెలంగాణలో ముందే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేతులు మారింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో ఆధిక్యతకోసం ముఖ్యంగా మూడుపక్షాలు – కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి – తలపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతో పాటు అసెంబ్లీకికూడా ఎన్నికలు మే 13న జరుగుతున్నాయి. ప్రాంతీయ పార్టీలైన వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం ప్రధాన ప్రత్యర్థులు. జనసేన, బిజెపి, టిడిపితో పొత్తుపెట్టుకున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టులు సర్దుబాట్లు చేసుకున్నా ఆ పార్టీల శక్తి, ప్రభావం పరిమితం. కాబట్టి ద్విముఖ పోటీయే ప్రధానం. డబ్బు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చవుతుంది. రెండు రాష్ట్రాలకూ ఎన్నికలు – ఆరోపణలు కొత్తకాకపోయినా ఇప్పుడు నాయకులు వాడుతున్న భాష తెలుగు భాషా సంపద విస్తృతిని, లోతును, దిగజారుడును ప్రదర్శిస్తోంది. పండగపూటయినా కాస్త ఉగాది పచ్చడి తిని నోటిని శుభ్రం చేసుకుంటారని, స్వరాన్ని సవరించుకుంటారని ఆశించుదాం!

# ఉగాది... తెలుగువారి సంవత్సరాది

భిన్న సంస్కృతులకు, భిన్న సంప్రదాయాలకు నెలవైన మన దేశంలో నూతన సంవత్సరాన్ని వివిధ ప్రాంతాల్లో, వేరువేరు పేర్లతో, వేరువేరు సందర్భాల్లో వేడుకగా జరుపుకొంటారు. ఈ క్రమంలో తెలుగు వారి సంవత్సరాది ఉగాది. జీవితపు భిన్న ఘటనలు, భావనల సమ్మేళనం. సుఖదు:ఖాలు, సంతోషవిషాదాలు, కోపతాపాలు.. ఇవన్నీ మన జీవితాన్ని నిర్దేశిస్తాయి. వీటిల్లో ఏది ఎక్కువా, తక్కువా అయినా జీవితం అర్థం లేకుండా గడుస్తుంది. అలా కాకుండా జీవితంలో అన్నింటిని సమభాగం చూపించేదే షడ్రుచుల ఉగాది పచ్చడి. పచ్చడిలో ఉండే ఒక్కొక్క పదార్థం, ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక. ఈ సమ్మిళిత సమ్మేళన సంపూర్ణ జీవిత పరమార్థాన్ని వివరించే ఉగాది కాలమానాన్ని గణించడానికి తొలిరోజు. శిశిర రుతువు ఆకురాలు కాలం. ప్రకృతి చలితో గడ్డకట్టుకొనిపోతుంది. మోడువారిపోతుంది. సంకోచం పొంది ఉంటుంది. శిశిరం తరువాత వసంతం వస్తుంది. వసంతాగమనంతో ప్రకృతి ఒక్కసారి పులకిస్తుంది. కొత్తదనాన్ని సంతరించుకుంటుంది. చెట్లు చిగుర్చి నూతన సృష్టి అంకురిస్తుంది. సర్వత్రా ఒక చైతన్యం అంతరంకాలని కదలిస్తుంది. కోకిలలు ఈ నూతన సంవత్సరానికి చక్కని గీతాలతో స్వాగతం పలుకుతాయి. ఇది సృష్టి క్రమం. ప్రకృతిని నియమించే ఈ విధానమే వ్యక్తులు, జాతుల స్వభావాన్ని కూడా నియమిస్తుంది.

సృష్టిలో కష్టసుఖాలు ఒకదానివెంట ఒకటి వస్తూనే ఉంటాయి. చైతన్యం నశించినప్పుడల్లా ఒక మహోద్యమం ఉద్భవించి, వైతన్యం నింపి, వికాసవంతమైన నూతన జీవితాన్ని నిర్మించడం సహజం. ఉజ్వల భవిష్యత్తు కోసం ఎవరికివారు ఉద్యమాన్ని నిర్మించుకోవడానికి, ఒక నూతన శకానికి పునాది వేసుకోవడానికి ఉగాదిని మించిన ముహూర్తం లేదు. గత కాలపు కష్టాలను, భవిష్యత్తును గురించిన స్వప్నాలను ఒకటిగా కలిపి కదిలించి ప్రజలను సంఘటితంగా నడిపించే శుభదినం. కష్టసుఖాలను రంగరించి, జీవితంలో ఎదురయ్యే అనేకానేక అనుభవాల షడ్రుచుల సమ్మేళనమే ఉగాది పచ్చడి. కుల, మత, ప్రాంతీయాది తేడాలు లేకుండా తెలుగువారంతా ఒక్కటై జరుపుకోవాల్సిన పర్వదినం.



తెలుగు వారికి మొదటి పండగ ఉగాది. యుగానికి ఆది తొలి రోజు అనే అర్థంలో ఉగాది పేరు వచ్చిందని అంటారు. దీనిని మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల్లో కూడా వేరువేరు పేర్లతో జరుపుకుంటారు. పేరే

నేడు క్రోధి నామ సంవత్సర ఉగాది



దైనా కావొచ్చు కానీ.. అన్నింటిలోనూ అంతర్లీనంగా ఉండే ఒకే ఒక లక్ష్యం బంగారు భవిష్యత్తు. తెలుగువారి మాదిరిగానే మరాఠీలు కూడా చాంద్రమానాన్నే అనుసరిస్తారు. వారు ఉగాదిని గుడిపడ్వాగా జరుపుకొంటారు. సింధీలు తమ కేలెండర్ ఏడాది ప్రారంభమైన చేతి చందును నూతన సంవత్సరంగా భావిస్తారు. మణిపురిలు కూడా తమ కొత్త ఏడాదిని అదే రోజున 'సాజిబు నోంగ్మా పన్బామా'గా నిర్వహించుకుంటారు. తమిళులు 'పుత్తాండు' అనే పేరుతో, మలయాళీలు 'విషు' అనే పేరుతోను, సిక్కులు 'వైశాఖీ' గానూ, బెంగాలీలు 'పొయ్లా బైశాఖ్' గానూ జరుపుకుంటారు. పేరు ఏదైనా, ఉగాదికి వసంతానికి అవినాభావ సంబంధం ఉంది. ఒక్కో పురాణం లేదా ఇతిహాసం ఒక్కో విధంగా పేర్కొంటున్నప్పటికీ, వృత్తాంతం ఏదైనప్పటికీ, జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగుల్కొల్పి మానవాళిలో నూతనాశయాలను అంకురింపయడమే ఉగాది అంతరార్థం. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించడం తెలుగువారి ఆనాయితీ. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. తీపి (మధురం),



పులుపు(ఆమ్లం), ఉప్పు (లవణం), కారం (కటు), చేదు (తిక్త), వగరు (కషాయం) అనే ఆరు రుచులు కలగలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.

ప్రపంచ దేశాలతోపాటు మనం కూడా అనేక సందర్భాల్లో సౌరమానాన్నే అనుసరిస్తున్నాం. సూర్యుడి గమనాన్ని అనుసరించి గ్రహచలనాలను లెక్కించడమే సౌరమానం. అయితే, సంప్రదాయ బద్ధంగా ఆచరించే పండుగలు, ఇతర కార్యక్రమాలకు చంద్రమానాన్ని అనుసరించడం రివాజు. అగ్నిని పూజించే పార్సీలుల సంవత్సరాది 'నౌరోజ్'. అది కూడా వసంత మాసంలో, సుమారుగా ఉగాదికి కొంచం అటూఇటూగా వస్తుంది. ముస్లింలు ఏ దేశం వారైనా చంద్రమానాన్నే అనుసరిస్తారు. అందుకే వారి పండగలు, ప్రధానంగా రంజాన్ ఒక్కోసారి ఒక్కో మాసంలో వస్తుంది. ఈసారి రంజాన్ మన ఉగాదికి రెండో రోజు, అంటే ఈనెల 11వ తేదీన వస్తుందని అంటున్నారు. అమావాస్య అనంతరం, పాడ్యమి నాడు సూర్యుడు కనిపించిన రోజునే ముస్లింలు రంజాన్‌ను జరపుకొంటారు.

సూర్యమానాన్ని అనుసరిస్తే, నెలకు 30 లేదా 31 రోజులు వస్తాయి. సంవత్సరానికి 365.25 రోజులు కాబట్టి, ఫిబ్రవరిలో 28 రోజులుగా పేర్కొన్నారు. ఏటా పావు రోజును కలిపి, ప్రతి నాలుగేళ్లకు ఒక రోజును కలుపుతారు. దానినే లీప్ సంవత్సరంగా పేర్కొంటారు. ఆ ఏడాది ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. అయితే, చాంద్రమానంలో 28 రోజులకు నెల అవుతుంది. ఏడాది లెక్కలు సరి చేయడానికే అధిక మాసాలు ఉంటాయి. ఈ అధికమాసం ఒక్కో ఏడాది ఒక్కో నెలలో వస్తుంది. పురాణాలు, ఇతిహాసాల్లో విశ్వ సృష్టి, గమనం ఎలావున్నా, కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్ష విభాగాలుగానే లెక్కిస్తారు. వసంత రుతువుతోనే సృష్టి ప్రారంభమైందని కొందరి అభిప్రాయం. శాలివాహనుడు పట్టాభిషిక్తుడైన దినం కారణంగా ఈ పండుగ ప్రాశస్త్యంలోకి వచ్చిందని మరొక గాథ. అభిప్రాయాలు, గాధలు వేరువేరుగా ఉండవచ్చుగానీ, వసంతంతో మళ్లీ చిగురించడం ప్రారంభమవుతుందనేది నిజం. వసంత మాస ప్రారంభం రోజును వేడుగా జరుపుకోవడంలో తప్పులేదు.

## 'క్రోధం' సంవత్సరానికి స్వాగతం



తెలంగాణ వాతావరణం
క్రోధము
శుభకృత్ నామ సంవత్సరం
అన్ని శుభాలు
క్రోధ నామ సంవత్సరంలో
మండుతున్న ఎండలు
పంచభూతాలను జయించాననే సంతోషం
నింగి నేలా / నీరు నిప్పు
గాలి ఆక్రమణలు
భవిష్యత్తు తరాలకు
పంచభూతాలను
పరిచయం ప్రశ్నార్థకం
ఉగాది షడ్రుచుల పచ్చడి
పిండి బెల్లం పప్పుతో బొబ్బట్లు
దేవాలయాలలో పంచాంగ శ్రవణాలు
దేవాలయాలన్ని కిటకిట
ధరలు ఆకాశాన్ని తాకడంతో
ఏది కొనాలన్నా కటకట
అభ్యంగ స్నానాలు
శివ నామ స్మరణలు
ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల
పునాది ఉగాది
తెలుగు పండుగల ఆది
డిజె సౌండ్లు లేవు కేక్ కటింగ్‌లు లేవు
మద్య మాంసాహార రుచులు లేవు
టపాకాయలు కాల్చడాలు అరుపులు కేకలు
కేరింతలు చప్పట్లు కొట్టడం క్యాలెండర్
మార్చడాలు లేవు .... ఉగాది నాడు
తెలుగు నూతన సంవత్సర వేడుకల సంబరాలు
సంతోషాలు
గుడికి వెళ్ళడం కొత్త బట్టలు ధరించడం
ఏ దేవాలయానికి వెళ్ళినా ఆధ్యాత్మిక శోభ
అందరి నోటా ఒకటే మాట
సర్వేజనా సుఖినోభవంతు

డాక్టర్ ఎస్ విజయ భాస్కర్,
9290826988

## కొత్తకాంతుల శోభ..

చెట్లన్నీ పచ్చగా చిగురించుకొని..
కొత్త వసంతానికి స్వాగతం పలుకుతున్నాయి.
మామిడితోటలు తోరణాలై...
వేపతరువులు పూలవర్షాన్ని కురిలిస్తున్నాయి.
కోయిలల కొత్తరాగాలు మయూరాల నాట్యాలతో..
ప్రకృతమ్మకు సూర్యుడు తిలకమై...
నక్షత్రాలు సిగలో పువ్వులై..
నెలవంక ముక్కుకు ముక్కుపుడకై
పచ్చని పంటలు ఆకుపచ్చని చీరకట్టి..
జొన్నకంకులు చేతబట్టి
క్రోధినామ వసంతానికి ఆహ్వానం
పలుకుతున్నాయి.

సుఖదుఃఖాల కలయికలో ఆరురుచుల పచ్చడి.
నవోదయాల ఉషస్సును ఉదయింపజేస్తూ..
ధరనిపై ధాన్యపురాసులను కురిపిస్తూ..
కార్మిక కర్షలలోకాన్ని కంటికిరెప్పలా కాపాడమంటూ
కాలభైరవుడవై శివస్వరూపాణివై మంగలకరమై
కన్నీరును తుడిచే కాలానివై..
కొత్తఆశలను చిగురింపజేసే ప్రయత్నానివై..



విజయాలను ఇచ్చే కొత్తపొద్దువై వచ్చేస్తున్న...
క్రోధినావ సంవత్సరమా నీకిదే ఆహ్వానం.

తెలుగింటిలోగిళ్ళలో ప్రతిఇంట నవ్వులకాంతులు
పల్లెజీవన ప్రతీకలు ఉగాది పండుగ వేడుకలు.
తెలుగునేలకు హాలికుడి పూజలు.
పచ్చనిపంటల సందడివై
అన్నదాతకు అండగానిలిచే ధైర్యానివై..
నిశీధిని చీల్చి వెలుగును నింపే దీపాణివై..
గరీబు కడుపుకు బుక్కెడు బువ్వమెతుకులు
అందించే ఉగాదివై..
పేదవాడికంట కన్నీరును తుడిచేయడానికి వస్తున్న
కొత్త క్రోధినామ సంవత్సరమా....నీకిదే ఆహ్వానం.

అశోక్ గోనె
9441317361

# మన ఉగాది రోజే మహారాష్ట్రలో 'గుడి పడవా'



డాక్టర్ దేవరాజు మహారాజు

వేల ఏళ్ళుగా ఈ దేశంలో నిచ్చెన మెట్ల వ్యవస్థ నడుస్తూ ఉంది. అందువల్ల మనకు లభించే చరిత్ర కూడా ఆ మనువాద వ్యవస్థలోంచి వచ్చిందే అయి ఉంటుంది. మరి నిజమైన అసలు చరిత్ర తెలుసుకోవడం ఎలా? అంటే మనకు మనం విషయాన్ని హేతువుతో కడిగి శుభ్రం చేసుకుని అర్థం చేసుకోవాలి. అందుకు మన వివేకాన్ని ఉపయోగించాలి. ఉదాహరణకు చరిత్ర గ్రంథాల్లో ఛత్రపతి శివాజీ రక్తం కక్కుకుని మరణించాడని నమోదయి ఉంది. యుద్ధంలో చనిపోవాలి. లేదా ప్రమాదవశాత్తు చనిపోవాలి. లేదా ఏదైనా దీర్ఘకాలిక వ్యాధితోనైనా చనిపోవాలి.. అంతేగాని, ఎవరైనా ఉన్నఫళంగా రక్తం కక్కుకుని చనిపోయారంటే, ఎవరో ఏదో కుట్ర చేశారని అర్థం. అది మరెవరో కాదు, మనువాదులైన బ్రాహ్మణులే. చాతుర్వర్ణ వ్యవస్థ ప్రకారం క్షత్రియులకే రాజయే అర్హత ఉంది. కానీ, ఇక్కడ శూద్రుడయిన శివాజీ చక్రవర్తి అయ్యాడు. అది బ్రాహ్మణ వర్గానికి ఇష్టం లేదు. ఆ కారణంగా, పట్టాభిషేకం చేయడానికి ఆ ప్రాంతంలోని బ్రాహ్మణులెవరూ ముందుకు రాలేదు. చివరకు వారణాసి నుండి గాగా భట్టును పిలిపించారు. ఆయన అసలుపేరు విశ్వేశ్వర భట్టు. ఆయనకు 'విదో నారాయణ' అనే బిరుదు ఉంది. వారణాసిలో పెద్ద పేరున్న బ్రాహ్మణ పండితుడు. ఆయన శివాజీకి పట్టాభిషేకం చేస్తూ చేతితో తిలకం దిద్దకుండా, కాలి బొటన వేలితో దిద్ది అవమానించాడు. పైగా క్షేత్రపతి అయిన రాజును ఛత్రానికి పరిమితం చేశాడు. ఛత్రపతి అంటే గొడుగు ధరించిన వాడని అర్థం. రాజుగా ఆయన అధికారం గొడుగు పరిధిలోనే ఉండాలని అన్యాపదేశంగా చెప్పడం. శివాజీ భోంస్లేను రాజుగా ఆమోదించడానికి బ్రాహ్మణ వర్గానికి మనస్కరించలేదు. ఆ విషయం ప్రతి అంశంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

మౌర్యుల చివరి రాజైన బృహద్దత్ మౌర్యున్ని– సేనాపతిగా ఉన్న పుష్యమిత్ర శృంగుడనే బ్రాహ్మణుడు కుట్రపూరితంగా హత్య చేయడం దగ్గర నుండి శివాజీ, అతని కుమారుడు శంభాజీల హత్య వరకు – అంతా మనువాదుల కుట్రలేనన్నది ప్రస్ఫుటంగా తెలుస్తూ ఉంది. కుట్రలు చేయడంలో బ్రాహ్మణ మనువాదుల్ని మించిన వారు లేరు. ఛత్రపతి శివాజీ తన యాభయ్యవ యేట ఏప్రిల్ 3, 1680న రక్తం కక్కుకుని చనిపోయాడు. శివాజీ కొడుకు శంభాజీ అధికారం చేపట్టగానే, తన తండ్రి విషప్రయోగం వల్ల చనిపోయాడని ప్రకటించాడు. అంతేకాదు, అందుకు కుట్ర పన్నిన బ్రాహ్మణ మంత్రుల్ని ఉరితీయించాడు. వారు, అన్నాజీ దత్తో సచిన్; దత్తోజి పంత్; నీలో సోండియో; బాలజీ అవజీ మొదలైన వారు. శూద్రుడైన శివాజీ భోంస్లే చక్రవర్తి కావడం గిట్టని మనువాదులు ఈ పనితో శంభాజీ భోంస్లే పై మరింత కక్ష పెంచుకున్నారు. తమ బ్రాహ్మణ వర్గీయుల్ని ఉరితీయించాడన్న అక్కసు వారిని ఊరికే ఉండనివ్వలేదు–ఎలాగైనా మట్టుబెట్టాలనుకున్నారు.

వారి కక్షకు మరో కారణం కూడా ఉంది. శివాజీ తన పెద్ద కొడుకు శంభాజీకి కేశవ్ పండిత్ దగ్గర చదువు చెప్పించాడు. కేశవ్ పండిత్ శంభాజీకి సంస్కృతం, హిందుస్థానీ భాషలు నేర్పించడమే కాకుండా, పురాణ గ్రంథాలు కూడా చదివించాడు. దానితో శంభాజీ విద్యావంతుడై పుస్తకాలు రాయడం ప్రారంభించాడు. బ్రాహ్మణులకు మాత్ర మే అందాల్సిన విద్యని శూద్రుడయిన శంభాజీ దక్కించుకున్నాడని మనువాదులు మరింతగా మండిపడ్డారు. గతంలో శివాజీని చంపిన వీరు, తర్వాత కాలంలో శంభాజీని చంపడానికి పథకాలు వేసుకున్నారు. అందుకే మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుకు తప్పుడు వార్తలు చేరవేశారు. ఆయనను శంభాజీ పైకి ఉసిగొల్పారు. మొఘల్ చక్రవర్తి సహాయంతో బ్రాహ్మణులు శంభాజీని దారుణంగా చంపించారు. కనుగుడ్లు పీకించారు. తల మొండెంతో వేరైపోయే విధంగా నరికించారు. అప్పటికి శంభాజీ వయసు ముప్పయి ఒక్కటి. తమను వ్యతిరేకించిన వారికి ఏ గతి పడుతుందో అందరికీ తెలియడానికి శంభాజీ రాజు తలను ఒక కర్రను గుచ్చి ఊరేగిస్తూ







ఆనాటి బ్రాహ్మణ వర్గం విజయోత్సవాలు చేసుకుంది. అదే పద్ధతి ఈనాటికీ మహారాష్ట్రలో 'గుడి పడవా'గా వాడుకలో ఉంది. శంభాజీ తలకు చిహ్నంగా ఒక కర్ర చివర చెంబు బోర్లిస్తారు. అందరికీ బాగా కనపడేట్లు చెంబుకింద పట్టువస్త్రం కట్టి, దాన్ని పూలతో అలంకరించి ఆ కర్రను ఉరేగిస్తారు. తర్వాత దాన్ని ఇంటి మీద పెడతారు. లేదా బయటికి కనబడేట్లు కిటికీలో పెడతారు. ఈ ఆచారం శంభాజీ మరణం తర్వాత, ఆయన స్మృతిలో 1689లో ప్రారంభమైంది. దీన్నే 'గుడి పడవా'గా జరుపుకుంటారు. ఇక్కడ తెలుగు నాట ఉగాది జరుపుకునే రోజే అక్కడ మహారాష్ట్రలో 'గుడి పడవా' జరుగు తుంది.



మరాఠా రాజు శంభాజీ – మరాఠీ, సంసకృతం, హిందుస్తానీ భాషలు నేర్చుకున్నాడు. ఆయా భాషల్లో రచనలు ప్రకటించాడు. 'బుద్ధ భూషణం' – అనే సంస్కృత రచనకు మంచి గుర్తింపు వచ్చింది కూడా ! అందులోనే ఆయన తన తాత షాహాజీ భోంస్లేకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తండ్రి శివాజీ మహారాజును అవతార పురుషుడిగా చిత్రించుకున్నాడు. అందుకే కాబోలు ఇప్పటికీ మహారాష్ట్ర ప్రజలు శివాజీని తమ ఆత్మగౌరవ ప్రతీకగా భావించి గౌరవించుకుంటారు. 'నాయిక భేద్', 'సాల్ సతక్' వంటి గ్రంథాలతో పాటు 'నక్షిక' అనే గ్రంథం హిందుస్తానీ భాషలో రాశాడు. మనువాదుల కుట్ర ఫలితంగా యుక్త వయసులోనే అతి కిరాతకంగా చంపబడ్డప్పటికీ అప్పటికే ఆయన విశిష్ట సాహిత్యసేవ చేయగలిగాడు. మరీ ముఖ్యంగా రాజకీయ కవిత్వం రాయడం శంభాజీ ప్రత్యేకత! మనువాదులు ఏర్పరిచిన పండగలన్నీ ఇతరుల చావులతో ఏర్పడినవే. హింసాత్మకమైనవి. అమానవీయమైనవి. పురాణ కల్పిత పాత్రలైన రావణుడు ఛస్తే పండగ. హోళిక చస్తే పండగ. అలాగే చారిత్రక పురుషుడైన శంభాజీ రాజును చంపించామని పండగ. ఈ మనువాదులు మానవత్వాన్ని మానవీయ విలువల్ని బతికించింది ఎక్కడా? అందుకే చెప్పేది – ప్రతి విషయాన్నీ మానవీయ కోణంలో పునః నిర్వచించుకోవాల్సి ఉందని!

మొఘలులైన ముస్లింలను మనువాదులు చక్రవర్తులుగా అంగీకరించారు. క్రైస్తవులైన బ్రిటీషు వారి అధికారాన్ని అంగీకరించారు. దేశంలో మూలవాసులైన శూద్రులు రాజ్యాధికారం దక్కించుకుంటే మాత్రం భరించలేకపోయారు. నిమ్న వర్గాల వారు ఎప్పటికీ బానిసలుగానే పడి ఉండాలన్నది వారి కోరిక. ఎందుకంటే వారి కష్టం మీద తాము సునాయసంగా బతుకుతూ ఉండాలన్నది వారి సిద్ధాంతం. బయటివారు ఎవరు అధికారం చేపట్టినా సరే – వారి దగ్గర 'జీ హుజూర్' అంటూ దేబరిస్తారు. వారి బూట్లు నాకి శరణువేడుతారు. కానీ, స్వశక్తితో అట్టడుగు వర్గం వాడు రాజయితే మాత్రం, అతణ్ణి రాజుగా అంగీకరించలేరు. అదే వారి ధర్మం. అదే వారి సమస్య! తర్వాత కాలంలో కొందరు శూద్రులు కూడా మనువాదుల ఆలోచనా ధోరణిని అనుకరిస్తూ, వారిలాగే మూర్ఖంగా ప్రవర్తించడం ప్రారంభించారు. అది ఇప్పుడు మనం. సమకాలీన సమాజం లో గమనిస్తున్నాం. లేకపోతే, శూద్రుడయిన నరేంద్రమోడి పూజారి వేషాలు వేసుకుని గుళ్ళు ప్రారంభించడానికే తను పుట్టినట్టు ప్రవర్తించడమేమిటీ? తనను ఎన్నుకున్నది పరిపాలన అందించడానికి అన్నది మరిచిపోవడ మేమిటీ? కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టినప్పటినుండి వారి ఐ.టి.సెల్ జనం మీదికి పుంఖానుపుంఖంగా అబద్దాలు గుప్పిస్తోంది. దేశ నాయకుల నుండి కిందిస్థాయి నాయకుల దాకా అహేతుకమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అసలు వారి స్థాయిని వారు మరిచిపోతేపోయారు. కానీ, ప్రజల స్థాయిని తక్కువగా అంచనా వేస్తున్నారు. అది క్షమించరాని నేరం!

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అందుకు విరుగుడు కనిపెట్టాడు. 'స్పెషల్ సోషల్ మీడియా'ను ప్రారంభించాడు. ఇది అక్కడి రాష్ట్ర పోలీసు డిపార్టుమెంటు ఆధ్వరంలో నడుస్తుంది. అబద్ధపు వార్తల్ని – ఫేక్ న్యూస్, ఫేక్ వీడియోల్ని ప్రచారం చేసే వారినీ, జాతి, మత, విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ఈ సెంటర్ పసిగడుతుంది. చట్టానికి అప్పగించి శిక్షపడే విధంగా చూస్తుంది. ఈ సెంటర్ స్థాపనకు కావల్సిన శాస్త్ర, సాంకేతిక పరికరాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10,285 కోట్లు కేటాయించింది. ఇలాగే ఫేక్ న్యూస్ నివారణకు బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ కలిసికట్టుగా ముందుకు వస్తే, దేశాన్ని అబద్ధపు వార్తల నుండి రక్షించుకోవచ్చు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది మంచి పాలన ఇవ్వమని, ఉపాధి కల్పించమని, హంగర్ ఇండెక్స్‌లో దిగజారి ఉన్న దేశ పరిస్థితిని మెరుగుపరచమని – అంతేగాని, ఎప్పటికప్పుడు ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకోవడం కాదు. ఉక్రేన్ పై రష్యా చేస్తున్న దాడిని కూడా మన కేంద్ర బిజెపి ప్రభుత్వం తనకు అనుకూలంగా మలుచుకోవడం చూశాం .

గుడి పడవా – ఎందుకు జరుపుకుంటున్నారు? శివాజీ – శంభాజీ రాజులు ఎలా చనిపోయారు ? చారిత్రక నేపథ్యం ఏమిటీ అనే విషయాలు తెలుసుకున్నాం గనక – ఇక ఇప్పుడు చరిత్రను కప్పిపెట్టి, తమ మత ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసుకునేందుకు వైదిక మతస్థులు అల్లిన కట్టు కథలేమిటో చూద్దాం ! గుడి పడవా అంటే 'బ్రహ్మ ధ్వజ'మనీ, ఈ విశ్వాన్ని బ్రహ్మ సృష్టించాడనీ చెప్పడానికి సంకేతంగా అలా ధ్వజాన్ని ప్రదర్శిస్తామని – మనువాదులు కథలల్లారు. కానీ, మరి అదే ధ్వజాన్ని 'ఇంద్ర ధ్వజం' అని ఎందుకు అన్నారూ? అదీ గాక, పధ్నాలుగేళ్ళు వనవాసం ముగించుకుని రాముడు అయోధ్యకు తిరిగివచ్చి పట్టాభిషిక్తుడయ్యాడనడానికి సంకేతంగా గుడి పడవా ప్రదర్శిస్తారని కూడా చెపుతారు. ఒక దానితో మరో దానికి పొంతనలేని పిట్టకథలు కల్పించి చెప్పడం వల్లనే – బ్రాహ్మణవాదం – వైదిక మతం చెప్పేవన్నీ అబద్ధాలని తేలిపోయింది. శంభాజీ రాజు తల నరికి, మొండెంతో వేరుచేసి – నరికిన తల కర్రకు గుచ్చి ఊరేగించి వారు విజయోత్సవాలు చేసుకున్నదే నిజం! ఆ చారిత్రక అంశాన్ని పక్కదారి పట్టించడానికి, కప్పిపుచ్చడానికి మనువాదులు చిత్ర విచిత్రమైన అభూత కల్పనలు ప్రచారం చేశారు. ఆ విషయం స్పష్టంగా అర్థం అవుతోంది. ఇంగిత జ్ఞానాన్ని ఉపయోగించని వారికి, మూఢభక్తిలో మునిగి ఉన్న వారికి చరిత్ర అర్థం కాదు. భ్రమల్లో బతకకుండా ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటూ ఉండాలి. మనువా



దులు ఏర్పరిచిన హింసాత్మక, అమానవీయమైన పండుగలు కాకుండా, మానవుడు విజయాలు సాధించిన సందర్భాలను పండుగలుగా జరుపుకోవడం మంచిది. ఇరవై ఒకటవ శతాబ్దంలో బతుకుతూ, వందల, వేల ఏళ్ళనాటి అనాగరిక పద్ధతుల్ని వదిలేయలేకపోవడం విచారకరం.

**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.**

## ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే గుణపాఠం తప్పదు

ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఆరు గ్యారంటీల అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. ప్రజలను మాయచేసి మభ్య పెట్టిందని.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే ప్రజలే తగిన గుణ పాఠం చెబుతారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీని వాస్ అన్నారు. చొప్పదండి నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ విద్యార్థి యువజన చైతన్య సదస్సు రామడుగు మండలం దేశరాజ్‌పల్లి శివారులోని వసుధ గార్డెన్‌లో జరిగింది. బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎంఎల్‌ఏ సుంకె రవిశంకర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లా డుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసమే 2001లో తెలంగాణ ఉద్యమం పుట్టిందని, 14 ఏళ్లు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గోదావరి, కృష్ణ నదులపై కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మాణం చేసి కోటి ఎకరాలకు సాగునీళ్లు ఇవ్వడం జరిగిం దని పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రశ్నించే గొంతు వినిపించాలంటే ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిం చాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మ న్‌లు ఏనుగు రవీందర్ రెడ్డి, పొన్నం అనిల్, వీర్ల వెంకటేశ్వర్ రావు, బిఆర్ ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** నేటి యువత చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునా యక్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం లోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో కొండమల్లేపల్లి మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది, రంజాన్ శుభాకాంక్షలతో ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెం ట్‌ను ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు మైనార్టీ యువత ఎంఎల్‌ఏను గజమాలతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారికి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశాలు కూడా కల్పిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో టీపీసిసి సభ్యులు డా. వేణుధ ర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఎ సిరాజ్‌ఖాన్, నేరేడుగొమ్ము ఎంపిపి బిక్కునాయక్, వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్‌రెడ్డి, ముక్కమల్ల వెంకటయ్యగౌడ్, ఎంపిటిసి జగన్, మాజీ సర్పంచ్‌లు కుంభం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## రామన్నపేట ఎంపిపి స్థానం కాంగ్రెస్ కైవసం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** పార్లమెంట్ ఎన్నికల సమీపి స్తున్న వేళా ప్రతిపక్షాలకు రామన్నపేటలో భారీ షాక్ తగిలింది. రామన్నపేట ఎంపీపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఎమ్మెల్యే వీరేశం నాయకత్వంలో మండల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఇంద్ర పాలనగరం గ్రామానికి చెందిన పూస బాలమణి ఎన్నికయ్యారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే వీరేశం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి పట్టణంలో ఏర్పాటు చేసిన అభినందనసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీ లను ఇప్పటికే అమలు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్య క్షుడు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, నాయకులు జెల్లా వెంకటేశం, కూనూరు సాయికుమార్‌గౌడ్, ఎండి.అక్రమ్, సాల్వేరు లింగం, జినకుల ప్రభాకర్, గంగుల రాజిరెడ్డి, పూస బాలకిషన్ పాల్గొన్నారు.

## మేషన్, చిప్పింగ్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ డివిజన్ లో పని చేస్తున్న మేషన్, చిప్పింగ్ కాంట్రాక్టు కార్మికుల వేతనా లను వెంటనే చెల్లించాలని ఏఐటియుసి సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూని యన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు ఉన్నాయని, అరకొర జీతాలతో కాలం వెళ్ళబుచ్చుకునే కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు రాక ఆవేదనకు గురవుతున్నారన్నారు. ప్రతి నెల కాంట్రాక్టు కార్మికులకు 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినప్ప టికీ దానిని అమలుపరచడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. ఇప్ప టికైనా యాజమాన్యం వెంటనే స్పందించి గత 4నెలల నుండి మేషన్, చిప్పింగ్ కాంట్రాక్టు కార్మికులకు రావలసిన జీతాలను వెంటనే ఇప్పించా లని వారు ఈ సందర్భంగా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు శ్రీనివాస్, సాయికుమార్, కృష్ణ, మల్లేష్, తిరుపతి, మనోజ్, సంతు, రాజు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## బోనకల్‌లో యువకుల వీరంగం

గంజాయి మత్తులో తరచూ దాడులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గంజాయి మత్తులో యువకులు వీరంగం సృష్టిస్తు న్నారు. ఎక్కడో ఓ చోట ఎప్పుడో జరిగిందనుకుంటే పొరపాటే. ఇటువంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. వ్యక్తుల పైనా, వాహనాల పైనా దాడులు చేస్తున్నారు. రోడ్ల వెంట హల్‌చల్ చేస్తూ ప్రమాదాలకు కార ణమవుతున్నారు. బోనకల్ మండలంలో ఈ సంస్కృతి గ్రామాలకు పాకు తుంది. నెల రోజుల క్రితం ఆళ్లపాడు గ్రామంలో ఎక్కడ నుంచో వచ్చిన ఐదుగురు యువకులు మత్తులో దారిన వెళ్లే వాహనంపై దాడి చేయడానికి ప్రయత్నించారు. అసభ్యంగా మాట్లాడుతూ ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడి చేసేందుకు సైతం వెనుకాడడం లేదు. ఆళ్లపాడు గ్రామంలో మత్తులో యువకుల హల్‌చల్ చూసి పలువురు భయాందోళనకు గురై పోలీ సులకు ఫోటోలు, ఆటో నెంబర్లతో సహా సమాచారం ఇచ్చారు. ఇంత వర కు అది ఏమైందో తెలియదు. ఆదివారం విపరీతంగా గంజాయి సేవించి మత్తులో ఉన్న ఐదారుగురు యువకులు బోనకల్‌లో హడావుడి సృష్టిం చారు. ఏమి జరిగిందో కానీ గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం చేయాలని డిమాండ్ చేశారు. యువకుడు గాయపడ్డాడన్న మానవ త దృక్పథంతో మేఘశ్రీ ఆసుపత్రి వైద్యులు చికిత్స నందిస్తుండగా మత్తులో అలా కాదు ఇలా ఇలా కాదు అలా అంటూ వైద్యులను ఇబ్బందులు పెట్టారు. వైద్యం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు.ఈ క్రమంలో యువకులను వారించబోగా ఆసుపత్రి సిబ్బంది పై దాడి చేయడం, సెల్ ఫోన్లు గుంజుకోవడం, ఆసుపత్రి ఫర్నీచర్ ధ్వంసం చేయడం చేశారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ ప్రజల చిర కాల స్వప్నం ఎస్ఎల్‌బిసి, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ మండల రైతు సంఘం 4వ మహాసభ మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో గంగిడి రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయ కుండా కేవలం కమిషన్‌ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద శ్రద్ధతో కాలయా పన చేసి, నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను గాలికొదిలేసిందని అన్నారు. నక్కల గండి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని కూర్చొని పూర్తి చేస్తానన్న మాజీ సిఎం కేసీఆర్ 10ఏళ్ల పాలనలో ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సొరంగ మార్గం టన్నెల్ పనులు పూర్తి దశలో ఉండగా బిఆరెఎస్ 10 ఏళ్ల పాలనలో 10 కిలోమీటర్లు పూర్తి చేయడానికి శ్రద్ధ చూపలేదని అన్నారు. ఎస్ ఎల్‌బిసి, నక్కలగండి ప్రాజెక్టులను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం శుభ పరిణామమని ప్రజా, రైతు ఆకాంక్షల మేరకు ప్రారంభించిన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని డిండి ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగు నీటినందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, మోడీ విధానాలు కేవలం కార్పొరేట్, పెట్టుబడి దారులకు మేలు చేసేవని మోడీ విధానాలతో ప్రజలకు ఒరిగేదేమీలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పా లని ప్రజలకు సూచించారు. మాజీ ఎంఎల్‌ఏ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా రైతులలో మొదలైన అపోహలను తేటతెల్లం చేసేందుకు రైతు బంధు నిధులు, రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతు భరోసాకు సంబంధించిన విధి విధా నాలను కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రైతులకు సంబంధించిన రుణమాఫీ చేయాలని కోరారు. ఈ మాహాసభలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు దేపా సుదర్శన్‌రెడ్డి, మండల కార్యదర్శి కేశవరెడ్డి, సహా య కార్యదర్శి రామస్వామి, మాజీ సర్పంచ్ జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

## కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సృజన్ కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు, మౌళిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్య డ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. సోమ వారం పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పిం చాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిఆర్‌డివో ఉప్పుల శ్రీధ ర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో ఉపాధిహామీ కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. అలాగే కూలీల పనుల సమయాన్ని 7 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగించాలని ఎక్కువ సమయం వరకు చేయించడం వల్ల ఎండ దెబ్బ తగిలి కూలీలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతా లకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించా లని కోరారు. ఉపాధిహామీ పనులు జరిగే ప్రదే శాలపై క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ చేయాలని, కూలీల ఇబ్బందులు తెలుసుకోవాలని, విధులు సక్రమంగా నిర్వ హించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. కొన్ని గ్రామాల్లో 12 గంటల వరకు పనులు చేపిస్తున్నారని, ఫోటో అప్‌లోడ్ చేసిన తర్వాత కూలీలు ఇంటికి వెళ్లే పరిస్థితి దాపురిం చిందన్నారు. ప్రభుత్వం ఉపాధిహామీ కూలీ లకు పనికి ముందు పని అయి పోయిన తర్వాత రెండు సార్లు ఫోటో అప్‌లోడ్ పద్ధతిని వెనక్కి తీసుకోవాలని, వర్షాలు లేక వ్యవసాయేతర భూములు గట్టిగా మారాయని, అట్టి ప్రదే శాల్లో కొలతలు పెట్టి కూలీ లతో పనులు చేయించడం వల్ల భూమి గట్టిగా ఉండడం వల్ల కొలతల ప్రకారం పనులు చేయక సరైన వేతనం పడక కూలీలు శ్రమ దోపిడీకి గురవు తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొలతలు లేకుండా పనులు కల్పించి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని, కిలోమీ టర్ పైగా దూరం ఉన్న పని ప్రదేశాలకు వెళ్లేం దుకు కూలీలకు రవాణా సౌకర్యం కల్పించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా నాయకులు ఎగుర్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## 'సాక్ష్యం' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు




**ప్రజాపక్షం/నల్లగొండ :** 85 సంవత్సరాలు నిండిన వయోవృ ద్ధులు వారి ఓటు హక్కును విని యోగించుకునేందుకు కేంద్ర ఎన్ని కల సంఘం హోమ్ ఓటింగ్ విధానం కల్పించినట్లుగానే, పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సదుపా యాన్ని కల్పించిందని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు సాక్ష్యం యాప్ ద్వారా, అలాగే ఫారం 12డి లో హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ లకు ఉద్దేశించి ఓటు హక్కు ప్రాధాన్యతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజర య్యారు. 45 శాతానికి మించి వికలత్వం ఉన్న దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి రాలేని పరిస్థితులలో హోమ్ ఓటింగ్ విధానానికి సాక్ష్యం యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే ఫారం 12డి లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులందరూ ఎన్నికలలో ఓటు వేసి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ట్రాన్స్‌జెండర్లు ఓటు వేయ డమే కాకుండా, ఓటింగ్ పై అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి రాజ్ కుమార్, ఐసిడిఎస్ పిడి సక్కు బాయి, ట్రాన్స్‌జెండర్స్ నాయకురాలు నందిని పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం

మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చౌటుప్పల్:** రాష్ట్రంలోని పేద ప్రజ ల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మున్సి పల్ కేంద్రంలో సోమవారం విలేకరుల సమా వేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవా లంటే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ కి ఓటేయాలని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలం గాణలో అత్యధిక పార్లమెంటు స్థానాలు గెలు స్తామని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి పార్ల మెంటు అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకా లంగా పనిచేస్తున్న చామల కిరణ్ కుమార్ రెడ్డిని ప్రకటించడం జరిగిందని అన్నారు. భువ నగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజారితో గెలిపించాలని కోరారు. తెలంగాణ ప్రజలను బిఆర్ఎస్ పార్టీ పదేళ్లుగా మోసం చేస్తూనే ఉందని కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పాలనలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. భువనగిరి ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు సేవ కుడిగా పని చేస్తానని అన్నారు. తప్పకుండా ఎంపీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చౌటు ప్పల్ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ అధ్య క్షులు సుర్వి నరసింహ, మండల అధ్యక్షులు బోయ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు ఇవ్వాలి

సర్క్యులర్ 1334 రద్దు చేయాలి : పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ :** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే సర్కు లర్ 1334ను వెంటనే ఉపసంహరించుకోవాలని, గత సంవత్సరంలో చేసిన సమ్మె ఒప్పందాలను అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలు ఇవ్వాలని ఏఐటి యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియే షన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లా దేవేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో 24 రోజుల పాటు సమ్మె చేసి పోరాటాల ద్వారా సాధించుకున్న టీచర్‌కు రెండు లక్షలు ఆయాకు ఒక లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను యాథావిధిగా అమలు చేస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చి ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం 1334 ఐసిడిఎస్ సర్క్యులర్ ద్వారా లక్ష మాత్రమే బెనిఫిట్స్ ఇస్తామని చెప్పి 65 సంవత్సరాలు నిండిన టీచర్లు ఆయాలను ఇంటికి పంపేందుకు సిద్దమైం దని సంవత్సరాల తరబడి ప్రజలకు సేవ అందించినటువంటి వారిని ఇంటికి పంపడం అంటే ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే సర్కులర్ 1334ను ఉపసంహరించుకొని, టీచర్లకు రెండు లక్షలు, ఆయాలకు లక్ష రిటై ర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గిం చడం, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలతో పాటు పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పిం చాలని కోరారు. కొత్త ప్రభుత్వం అంగన్‌వాడీల కోరికలను పరిశీలించి కొత్త ఉత్త ర్వులు ఇవ్వాల్సింది పోయి గతంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వ్యతిరేకించిన పాత జీవో ఉత్తర్వులనే ముందుకు తెచ్చి అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల మనోభావాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకో కుండా ఆర్థికంగా నష్టం కలిగించే విధమైన చర్యలు చేపడుతూ ఏకపక్షంగా ముందుకు సాగుతుందని ఆరోపించారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**ప్రజాపక్షం /మునుగోడు :** గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు గత రెండు నెలలుగా రావా ల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మునుగోడు మండలం పులిపల్పుల గ్రామంలో జరుగు తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి అనంతరం కార్మికులతో మాట్లాడుతూ మూ డోసారి నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనిని , ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తివేయడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి, నాయకులు కంభంపాటి మారయ్య, యాదయ్య, నీలకంఠ సైదమ్మ, కంభంపాటి పూలమ్మ, దుర్గమ్మ, సింగం లింగమ్మ పాల్గొన్నారు.



## రైస్‌మిల్లర్లతో మంత్రి వెంకట్‌రెడ్డి కుమ్మక్కు

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఆరోపణ



**ప్రజాపక్షం/చౌటుప్పల్:** రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతా మని మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. భువ నగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సోమ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతగాని హామీలు ఇచ్చి అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో వంద రోజు ల్లోనే దశాబ్ద కాలపు అభివృద్ధిని వెనక్కి తీసుకువె ళ్లారని అన్నారు. ఊర కుక్కల లాగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హడావిడి తప్ప రైతులకు చేసేదేమీ లేదని విమర్శించారు. మిర్యాలగూడలో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి తమ బాధలు చెప్పినా కూడా పట్టించుకో లేదని తెలిపారు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ధాన్యం కొనుగోలులో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న రైతు మిల్లర్లకు మంత్రి వత్తాసు పలకడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర మొత్తంలో రైతాంగం దగ్గర దోచుకున్న సొమ్మును ఢిల్లీలో కప్పం కడుతూ పరిపాలన కొనసాగిస్తున్నారని పేర్కొ న్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేష్‌ను గెలిపించడానికి కార్యకర్తలు పరిశీయాలని గెలిపించడానికి కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో భువన గిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆ ర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, నల్లగొండ జిల్లా అధ్య క్షులు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్, సూర్యా పేట జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

## సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుండికుడి కాలువ కు త్రాగు నీటి అవసరాల నిమిత్తం సోమ వారం ప్రాజెక్ట్ అధికారులు నీటిని విడు దల చేశారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ ఈ ఈ శివశంకరయ్య పర్యవేక్షణ లో కుడి కాలువకు నీటి విడుదల చేశారు.రోజుకు 5,500 క్యూసెక్కుల నీరు చొప్పున మొత్తం 5 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నా రు. 10 రోజుల పాటు కుడి కాలువకు నీటి విడుదల చేనున్నట్లు వారు తెలిపారు.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం :** నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ఇది 312.50 టిఎంసి లకు సమానం. ప్రస్తుత నీటిమట్టం సోమవారం సాయంత్రం నాటికి 511.20అడుగులు ఉండగా ఇది 133.7164 టిఎంసిలకు సమానం. అయి తే ప్రస్తుతానికి రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల నీరు ఔట్ ఫ్లో గా విడుదల అవుతూ ఉండగా రిజర్వాయర్ కు ఎటువంటి ఇన్ ఫ్లో రావటం లేదు. అదేవి ధంగా ప్రధా న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్తు ఉత్పత్తి జరగడం లేదు.

## బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బిఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి నామ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బిఆర్ ఎస్ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేసిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వైస్ ఎంపిపి గుత్తా రవి అధ్యక్ష తన జరిగింది. ఈ సమావేశంలో నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు కాంగ్రెస్ మొండి చేయి చూపించింద న్నారు. కాంగ్రెస్ మెడలు వచ్చి పథకాలు అమలు చేయించేందుకు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. బూత్ స్థాయి నాయ కులు, కార్యకర్తలు కంకణబద్ధులై అందరు కలిసి మెలిసి పని చేసి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ ఎంపిలను గెలిపిం చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపి నుంచి గెలిచిన ఎంపిలు ఏనాడు జిల్లా గురించి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ఎంఎల్‌సి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ మాట్లాడుతూ నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే రాబోయే ఐదేండ్లు కార్యకర్తలకు, ప్రజ లకు అండగా ఉంటారన్నారు. నామను గెలిపించి కేసిఆర్‌కు అండగా నిలవాల న్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరునాయక్, నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వెంకటరమణ, కుర్రా భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు



**ప్రజాపక్షం/సూర్యాపేట(రూరల్):** జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరణ ప్రక్రియను వేగ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంక ట్రావ్ అన్నారు. సోమవారం సూర్యాపేట రూరల్ మండల పరిధిలోని ఇమాంపేట ఐకెపి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా 354.896 మెట్రిక్ టన్నుల ధాన్యం అంచన ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 241.000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చినట్లు చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తాలు, తేమశాతం 17కు మించకుండా నాణ్య మైన ధాన్యం తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. కేంద్రానికి వచ్చే రైతు లకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహ కులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 281 కేంద్రాల్లో ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమశాతం మిషన్లు, టార్పాలిన్లు, గొనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు నీడ కోసం టెంటు, నీటి వసతి కల్పించి వేసవి కాలం దృష్ట్యా ఒఆర్ ఎస్ ప్యాట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాల న్నారు. అనంతరం పెన్‌పహడ్ మండలంలోని శ్రీ వెంకట సాయి రైస్ మిల్లును తనిఖీ చేసి ధాన్యం నిల్వలను పరిశీలించారు. సిఎంఆర్ ధాన్యం, ఎఫ్‌సిఐకి చెల్లించాల్సిన, ప్రస్తుతం బ్రాయిల్డ్ రైస్ ఎఫ్‌సిఐకి కేటాయించిన ప్రకారం వెంటనే అందించాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో డిఎస్‌వో మోహన్ బాబు, తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, మహిందర్ రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ నాగలక్ష్మి , ఎపిఎం బాబు, ఐకెపి స్బంది పాల్గొన్నారు.

**తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి**

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట మున్సిపల్ ప్రజలు తాగునీటిని పొదుపు లుగా వాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఫ్లో మీటర్‌ను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రలకు 24 ఎంఎల్‌టిల తాగునీటిని అందిస్తున్నట్లు తెలి పారు. మున్సిపాటిలో విలినమైన గ్రామాల్లో ఎక్కడ తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికా రులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచిం చారు. వేసవి దృష్ట్యా మూడు నెలలు తాగునీ టిని వృధా చేయకుండా ప్రతీ ఒక్కరు పొదు పుగా వాడుకోవాలని చెప్పారు. మున్సిపల్ పరి ధిలోని అన్ని వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయాలని, నీటి టెస్ట్ చేసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఈఈ కృష్ణ ప్రసాద్, ఎంబిఈఈ కరుణాకర్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు ఇచ్చేవరకు మధ్యాహ్న భోజనం నిలిపివేస్తాం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భూక్యా రామేష్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు ఇచ్చే వరకు మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వపాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిపివేస్తామని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భూక్యా రామేష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు జీతం లేక, సరుకులు తీసుకురాలేక కిరాణా కొట్టులో ఉద్దెర ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సిహెచ్.లక్ష్మి, మొనవ్వ, ఎ.ల. సాయివ్వ. మమత, మనీషా, పావని భాగ్య, లలిత, రజిత. విమల, హంస, లక్ష్మి, రూప, సావిత్రి, లక్ష్మి, రాధా, పోసాని, లలిత, జుబేదా, ఫర్జన పాల్గొన్నారు.

## వంట కార్మికులను ఆదుకోండి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : మధ్యాహ్నం భోజనం వంట కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని సోమవారం కార్మికులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి అనుబంధ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెన్న మహేష్ ఆధ్వర్యంలో కార్మికులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ ముక్రం, వెన్న మహేష్, లక్ష్మీ, సుగుణమ్మ, గౌతమి, లతా, శారద, జమున తదితరులు పాల్గొన్నారు

## ట్యాంక్‌బండ్‌పై రాంజీ గోండు విగ్రహం

సిపిఐ జిల్లా కార్యదర్శి విలాస్ డిమాండ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : స్వాతంత్ర సమరయోధుడు రాంజీ గోండ్ సిపిఐ నిర్మల్ జిల్లా కౌన్సిల్ తరుపున ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ నిర్మల్‌లో రాంజీ గోండ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో కేంద్రమంత్రి అమిత్‌షా ఇచ్చిన హామీ హామీ ఇప్పటివరలకు నెరవేరలేదన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై రాంజీ గోండు విగ్రహం పెట్టాలని, మూజియం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సింగరేణికి కొత్తగనులు రావడం లేదు

యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన చట్టం వల్ల సింగరేణిలో కొత్త గనులు రావడం లేదని, కార్మిక వ్యతిరేక బిజెపికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ది చెప్పాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. సోమవారం సింగరేణి ఆర్జీవన్ ఏరియాలోని జిడికె 11వ ఇంక్లెన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్ ప్రకాశ్, ఉప ప్రధాన కార్యదర్శి మద్దీ ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త చట్టం తేవడం వల్ల కొత్త గనులు రావాలంటే టెండర్‌లో పాల్గొని వేలం ద్వారా దక్కించుకోవాల్సన పరిస్థితి నెలకొందని, దీంతో కొత్త గనులు దక్కించుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు వేలం ద్వారా దక్కించుకుంటున్నారన్నారు. కొత్త గనులు రావాలంటే చట్టంలో మార్పులు జరగాలంటే కార్మిక వ్యతిరేక బిజెపి కి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. గని పిట్ సెక్రటరీ మోదుగుల సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు రంగు శ్రీనివాస్, ఎస్ వెంకట్‌రెడ్డి, గోడిశల నరేశ్, సిద్దమల్ల రాజు, ఆరెల్లి రాజేశ్వరరావు, ఇనుముల రాజమౌళి, కాంపెల్లి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎంఎల్ఎ కడియం శ్రీహరి

ప్రజాపక్షం/తొర్రూరు : వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంఎల్ఏ కడియం శ్రీహరి కోరారు. సోమవారం మహబాదు జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంఎల్ఏ యశస్వినీ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఎంఎల్ఏ యశస్వినీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. సమావేశంలో ఝాన్సీరెడ్డి, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, వైస్ ఎంపిపి శ్యాంసుందర్‌రెడ్డి, కౌన్సిలర్ గజానంద్, నర్సయ్య, గంజి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు : యశస్వినీరెడ్డి

ప్రజాపక్షం/తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పారదర్శకంగా జరుగాలని, పనుల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా చర్యలు తప్పవని ఎంఎల్ఏ యశస్వినీరెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువులో నిర్మాణంలో ఉన్న మినీ ట్యాంక్ బండ్ పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మినీ ట్యాంక్ బండ్ పనులను నాణ్యత లేకుండా చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ రామ చంద్రయ్య, సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు భూసాని రాము, కర్నె నాగజ్యోతి, కొలుపుల శంకర్,నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, విజయ్ పాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, ప్రసాద్ రెడ్డి, బిక్షం గౌడ్ పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానియ్యొద్దు

మెదక్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోలికేరి

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : మెదక్ జిల్లాలో తాగునీటి సమస్యను ఎదుర్కొనడానికి ప్రణాళిక బద్ధంగా పని చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ భారతి హోలికేరి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయపు సమావేశపు హాలులో వేసవిలో మంచినీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఇంట్రా, విద్యుత్, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, ఎంపీఓలు తదితరులతో త్రాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తాగునీటి సరఫరా ప్రత్యేక అధికారి భారతి హోలీ కేరి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి పూర్తి అయ్యే వరకు





అధికారులు పక్కా ప్రణాళికతో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే 2 నెలల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కమలాకర్ పాల్గొన్నారు.





తాగునీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక

సిద్దిపేట ప్రతినిధి : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎండకాలంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి భారతీ హోలికేరి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్లుఎస్, మిషన్ భగీరథ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తాగునీరు సరఫరా క్రమపద్ధతిలో సాగుతుందని, వర్షాకాలం ప్రారంభమయ్యేవరకు జిల్లాలోని అన్నిగ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి సరఫరా చేసేందుకు అవసరమైన తాగునీటి వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. తాగునీరు సరఫరా చేసే చివరి గ్రామం వరకు ఇబ్బంది లేకుండ తాగునీరు సరఫరా అయ్యేందుకు అవసరమైన చోట స్థానిక నీటివనరులు ఉపయోగించుకోవాలన్నారు. అందరు సమన్వయంతో పనిచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ వివిధశాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండి జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్లుఎస్ అధికారులు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



ప్రజాపక్షం/జహీరాబాద్ : సంగారెడ్డి జిల్లా పరిధి కోహిర్ మండల కేంద్రంలో సోమవారం జహీరాబాద్ డివిజన్ మిషన్ భగీరథ అధికారులతో కలిసి కలెక్టర్ వల్లూరి క్రాంతి పర్యటించారు. కోహిర్ మండల కేంద్రంలోని మిషన్ భగీరథ వాటర్ సంపు దగ్గర కలెక్టర్ పరిశీలిస్తుండగా కోహిర్ గ్రామ ఎంపిటిసి 2 ప్రతినిది కౌసర్ అబ్దుల్ హన్నాన్ జావిద్ మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి సానుకూలంగా స్పం దించి త్వరలో సమస్య పరిష్కారానికి చర్యను తీసుకోవాలని సంబంధిత అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. పైపుల లికేజీని అరికట్టాలని అధికారులను ఆదేశించారు.

నెక్కొండ : వేసవిలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం నెక్కొండ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సంబంధిత అధికారులతో మండలంలో గ్రామాల వారిగా వేసవిలో తాగునీటి సరఫరా కొరకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. అనంతరం నెక్కొండ మండలంలోని అప్పాలరావుపేట గ్రామంలో క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ అధికారులతో కలిసి మిషన్ భగీరథ ఆధ్వర్యంలో సరఫరా అవుతున్న నీటి సరఫరా తీరును పరిశీలించారు. మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయంగా అవసరమైనచో గ్రామంలో వ్యవసాయ బావిని పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంతో పాటు క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, శాఖ సంయుక్త సంచాలకులు ఉషాదయాల్, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ రాజేష్, ఎంపిఓ సతీష్, వివిఎస్ ఓలు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.



## రానున్న రెండునెలలు అప్రమత్తం

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి: జిల్లాలో ఉన్న ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని, రాబోయే 2 నెలల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి ఇబ్బందులు రాకుండా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని నీటి సరఫరా పర్యవేక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ బి గోపి అన్నారు. సోమవారం ములుగు కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నీటి సరఫరా పర్యవేక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ బి గోపి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, మండల ప్రత్యేకాధికారులతో జిల్లాలలో త్రాగునీరు సరఫరాపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితతో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపి మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగి త్రాగునీటి వనరులు తగ్గిపోతాయని, ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీరు అందించడం కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, మూడు ఇంటెక్‌వెల్స్ ద్వారా జిల్లాలో అన్ని గ్రామాలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాలలో నీటి వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామని గ్రామాలలో ప్రత్యేక అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ త్రాగునీటి సమస్యలు నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డిఆర్‌డిఏ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్ఓ అలెం అప్పయ్య, ఎస్‌సి డెవలప్‌మెంట్ అధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లఘించారని బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిపై కేసు



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి.. ఎలాంటి అనుమతి లేకుండా ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రచారం చేసిన బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డిపై సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ సిఐ కథనం ప్రకారం... అనుమతి లేకుండా ప్రభుత్వ ఉద్యోగులతో బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇంచార్జి కడవేర్గు ఫృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు.. ఆదివారం రాత్రి 9.55 గంటలకు విధి నిర్వహణలో ఉండగా రంగధాంపల్లి శివారులో రెడ్డి ఫంక్షన్‌హాల్ రాజకీయపార్టీ నాయకులు జిల్లా పరిధిలో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం రాగానే సిబ్బందితో వెళ్లగా రెడ్డి ఫంక్షన్‌హాల్‌కు చేరుకోగానే తమను గమనించి అక్కడున్న వారు వాహనాలను వదిలి పరుగులు తీసినట్లు తెలిపారు. ఫంక్షన్‌హాల్‌కు వెళ్లగా సిబ్బంది మినహా ఎవ్వరు లేరన్నారు. మేనేజర్ సహాయంతో సిసిపుటేజీ పరిశీలించగా బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి పరుపాటి వెంకట్రామ్ రెడ్డి, సుడా మాజీ చైర్మన్‌లు రవీందర్‌రెడ్డిలు మాట్లాడుతున్నట్లు సిసిపుటేజీ లభించినట్లు తెలిపారు. ఉద్యోగులకు ప్రలోభ పెట్టడానికి భోజనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా దీనిపై సోమవారం సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌లు కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు.

## జైతెలంగాణ అనని సిఎంకు ఓటు అడిగే హక్కులేదు

మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : తెలంగాణ ఉద్యమంలో సిఎం రేవంత్‌రెడ్డి ఏనాడైన పాల్గొన్నారా ? జై తెలంగాణ అని నినదించారా? ఉద్యమ కారులపై తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కులేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. జిల్లాలను రద్దు చేస్తానంటున్న సిఎం రేవంత్‌రెడ్డికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు రద్దు చేయాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో సిద్దిపేట నియోజక వర్గ స్థాయి యువత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట సంబంధించి రూ.150 కోట్లను రద్దు చేసి, వెటర్నరీ కళాశాలను కొడంగల్ కు తరలించుకెళ్లిన రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాజీ సిఎం కెసిఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణను తెచ్చారన్నారు. రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనలేదు.. అమరవీరులకు నివాళ్లు అర్పించలేదన్నారు. భవిష్యత్ బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులదే అన్నారు. సోషల్ మీడియాలో ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. దుబ్బాకలో చెల్లని రఘునందన్‌రావు మెదక్ పార్లమెంట్‌లో చెల్లుతుందా అని ఎద్దేవా చేశారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్, బిజెపిలకు బుద్ధి చెప్పాలన్నారు. తాను ఊపిరి ఉన్నంత వరకు మీకోసం పనిచేస్తానని, సిద్దిపేట అభివృద్ధి శ్వాసగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలు అటకెక్కాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్. బిజెపిలకు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



నావిజయంలో యువతదే కీలక పాత్ర:వెంకట్రామ్‌రెడ్డి

నా విజయంలో యువతనే కీలక పాత్ర నిర్వహించాలని బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్‌గా అందరి మన్ననలు పొందానని, ఎంపీగా అవకాశం కల్పించాలని కోరారు. కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో సిద్దిపేటను కెసిఆర్, హరీష్‌రావు సహకారంతో సిద్దిపేట ను దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. యువతకు దశ, దిశను అవుతానని, యువతరానికి చుక్కాని అవుతానన్నారు. పేద యువత కోసమే రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్‌లో యువత కీలక పాత్ర పోషించాలని, 35 రోజులు నాకోసం పనిచేస్తే 5 ఏండ్లు మీకోసం పనిచేస్తానన్నారు. ఉద్యమాల గడ్డ సిద్దిపేటలో ఎంపిగా నాకు అవకాశం కల్పించే బాధ్యత మీపైన ఉందన్నారు. కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తికి పార్లమెంట్‌లో అడుగుపెట్టె అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ మండలాల ముఖ్యనేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడిగడ్డ కుంగుబాటుకు గత ప్రభుత్వానిదే బాధ్యత

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాపక్షం /జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : లక్ష కోట్లతో నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండె కాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ గత ప్రభుత్వ తప్పిదం వల్లనే ప్రాజెక్టు కుంగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. సోమవారం జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ ని సోమవారం సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ రాష్ట్ర బృందం మేడిగడ్డను సందర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ కి ఉదయం 11 గంటలకు చేరుకొని బ్యారేజి లోని కృంగిన 19,20,21 పిల్లర్ల ను పరిశీలించారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన వేడిగడ్డ కృంగిపోవడంతో లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్లపాలు చేశారని మండిపడ్డారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కలల ప్రాజెక్టు అని గొప్పలు చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టు ఇంత తక్కువ కాలంలోనే కృంగిపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ప్రాజెక్టు డిజైన్ లోపమా నిర్మాణ లోపమా నిపుణులు కమిటీ తేల్చాలని అన్నారు. మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యులైన ఎల్ ఎన్ టి సంస్థ లేదా గత ప్రభుత్వం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు. గత ప్రభుత్వాల బాధ్యత రహితం వల్లనే ఈ సంఘటన చోటు చేసుకుందని, ప్రజల డబ్బు కాబట్టి ఇంత పెద్ద ప్రాజెక్టు కట్టే ముందు అఖిలపక్షం, నిపుణులతో కమిటీ వేసి నిర్మాణం చేపట్టవలసి ఉండేది. కెసిఆర్ చరిత్ర సృష్టించడం



కోసం చేసిన తప్పిదం వల్ల ప్రజాధనం వృధా అయిందన్నారు. ఇప్పుదున్న ప్రభుత్వం బాధ్యతయుతంగా వ్యవహరించాలని బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో నీటి కరువు మొదలవు తుందని వెంటనే రైతులను తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సాగు నీటి ప్రాజెక్ట్ లోనే అత్యధిక ఖర్చు చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని, మేడిగడ్డ కుంగిపోవడం పై న్యాయ విచారణ చేసి బాధితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును కొనసా గించాలా లేదా తర్వాత ఆలోచించండి కానీ ప్రస్తుతం రైతులతో రాజకీయాలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యలు మరమ్మత్తులు చేపట్టి రైతులకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు,సీపీఎం పార్టీ పట్టణ అధ్యక్షులు వెలిశెట్టి రాజయ్య ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలేం రాజేందర్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం చిన్న రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, ఆకుదారి రమేష్, ఆత్కూరి శ్రీధర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య టెక్నో స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

డిఇఒ వాసంతికి వినతిపత్రం అందింజేత

ప్రజాపక్షం/నర్సంపేట : వచ్చే ఏడాది విద్యాసంవత్సరాన్ని పురస్కరించుకోని ముందుస్తుగానే ఒకఅద్దె భవనంలో పాఠ్యపుస్తకాలను భద్రపరుస్తున్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్‌లు డిమాండ్ చేశఋారు. వరంగల్ జిల్లా డిఈవో వాసంతికి వినతిపత్రాన్ని సోమవారం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యం శనివారం రోజున ముందస్తుగా 2024 25 విద్యా సంవత్సరానికి గాను పాఠ్యపుస్తకాలను ఓ ప్రైవేట్ వాహనంలో తెప్పించి పట్టణంలో ఒక అద్దె భవనంలో భద్రపర్చారన్నారు. దీనిపై విద్యా సంఘాల నాయకులు యాజమాన్యాన్ని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారన్నారు. తక్షణమే ఆపాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, సతీష్ పాల్గొన్నారు.



## తాగునీటి సమస్య రాకుండా చూడండి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : వేసవి పూర్తి అయ్యే వరకు పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి మిషన్ భగీరథ, ఇంట్రా, మునిసిపల్, విద్యుత్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ, ఎంపిఓలతో జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు నెలలు మంచినీటి సరఫరాకు అత్యంత కీలకమని నిరంతర పర్యవేక్షణతో మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా జిల్లాలో తాగునీటి సరఫరాపై వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంక ప్రసాద్, అదనపుకలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నళిని, విద్యుత్‌శాఖ ఎస్ఇ మల్చూర్, జడ్పి సీఈవో విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, డిఆర్‌డీఓ నరేష్, సిపిఓ శామ్యూల్, మత్స్యశాఖ అధికారి అవినాష్ పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలకు సన్నద్ధం కండి : కలెక్టర్ రిజ్వాన్‌భాష

ప్రజాపక్షం /జనగామ ప్రతినిధి : నిరుద్యోగులు ప్రభుత్వం కల్పించిన శిక్షణ సౌలభ్యాలను ఉపయోగించుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పిలుపునిచ్చారు. సోమవారం జనగామలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగు యువతకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగాల్లో పోటీ పెరిగిందన్నారు. లక్ష్యసాధన దిశగా ప్రయత్నం చేస్తే తప్పక ఉద్యోగం లభిస్తుందని, అందుకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను కూడా ఉపయోగించుకోవాలన్నారు. గ్రూప్1, గ్రూప్2, ఉపాధ్యాయ పరీక్షల పోటీకి సిద్ధం కావాలన్నారు. ఆర్థికంగా వెనకబడిన యువత ఎలాంటి సౌలభ్యాలు లేక శిక్షణ పొందలేకపోవడం మూలంగానే ప్రభుత్వం ఈ వెసలుబాటు కల్పించిందన్నారు. జనగామలో శిక్షణ కోసం 86 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి మూడు నెలల కాలపరిమితిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. భోజన వసతి కల్పించడంతో పాటు నిపుణుల చేత తరగతుల బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి దయానందరాణి, అధ్యాపకులు నిర్వాహకులు, కవిత, సిహెచ్ రామనర్సయ్య, ఆర్ అనిల్, వసతి గృహ సంక్షేమ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



యుపిఎస్‌సి, క్యాట్ పరీక్షల కోచింగ్ కోసం తెలంగాణ మైనార్టీ స్టడి సర్కిల్ మైనార్టీ సంక్షేమ శఋాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్ దరఖాస్తు గడుబు పొడగించినట్లు కలెక్టర్ తెలిపారు.




























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు



**ప్రజాపక్షం/చెన్నూరు/మంచిర్యాల :** చెన్నూరు మండలం లంబాడిపల్లి గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గడచిన 20 రోజులుగా గ్రామంలో తాగు నీటి సరఫరా జరగకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో గ్రామ మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 రోజులుగా గ్రామంలో తాగు నీరు అందించడం లేదని, వేసవి కాలంలో తాగు నీటిని అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధింత అధికారులు స్పందించి గ్రామంలో బోర్లు మరమ్మత్తులు చేయడంతో పాటు మంచి నీరు సరఫరా చేయాలని వారు కోరారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణ పరిధిలో వెంకట్‌రావుపేట్‌లో సోమవారం మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గా మైదానంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మోహన్ మాట్లాడుతూ ఈద్గా మైదానంలో, పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. పవిత్ర రంజాన్ పండుగ రోజు తాగునీరు ఏర్పాటు చేయాలని, నమాజ్‌కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సానిటరి ఇన్స్‌పెక్టార్ గుర్రం రత్నాకర్, ముజీబ్, నర్సయ్య, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** రానున్న రంజాన్ పండుగ కోసం, ఖానాపూర్ మున్సిపాలిటీ నుంచి, అన్ని ఏర్పాట్లు మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం పరిశీలించారు. సోమావారం,ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని కబరస్తాన్, ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులను సమీక్షించారు. పండుగను పురస్కరించుకొని, ముస్లిం సోదరులకు అన్ని ఏర్పాట్లు సకాలంలో చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్లు కురమ శ్రీనివాస్, కాంగ్రెస పార్టీ మండల జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాష, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మైనార్టీ మండల అధ్యక్షులు సలీం ఖాన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు షౌకత్ పాషా,మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమంలో బోథ్ ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండల కేంద్రంలోని పట్పటి తాండా గ్రామంలో నిర్వహించిన పట్పటి తాండా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యాలయంలో పాల్గొని సోమవారం ఆటలో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం బోథ్ ఎంఎల్ఎ అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్‌లు వదిలేసి క్రీడల వైపు మొగ్గుచూపాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో షాపులో నానాక్ సింగ్ కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

## 3వ రోజుకు చేరిన నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి ఇసుక రీచ్ మూసివేయాలంటూ డిమాండ్ చేస్తూ రీచ్ వద్ద గ్రామస్తులు నిరాహార దీక్ష సోమవారంతో మూడో రోజు చేరింది. ఈ సందర్భంగా నిరాహార దీక్ష లోకూర్చున్న వారు మాట్లాడుతూ ఇసుక తరలింపుతో మానేరు వాగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఈ వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఏర్పడుతుందని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేసి కాంట్రాక్ట్ రద్దు చేసే అంతవరకు నిరాహార దీక్షలు కొనసగుతాయి అన్నారు, ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనాయక్ దామోదర్ రావు. ఎంపీటీసీ శీలం శంకర్, కోడి కనకయ్య , నల్లవెల్లి రాజమౌళి, గుర్రం శ్రీనివాస్, రాజారాం, కోడెం శ్రీనివాస్ , తాజుద్దీన్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్‌లను బంద్ చేయండి

కాల్వ శ్రీరాంపూర్ గ్రామస్తుల డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్ లను వెంటనే రద్దు చేయాలని కాల్వ శ్రీరాంపూర్ గ్రామస్తులు, రైతులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని, కిష్టంపేట, మిర్జంపేట, మొట్లపల్లి గ్రామంలో ప్రభుత్వం ఇసుక రీచ్లకు అనుమతి ఇవ్వగా ఇసుక రీచ్ లను రద్దు చేయాలని, ఇసుక రీచ్‌ల వల్ల భూగర్భ జలాలు ఎండిపోయి తాగు నీటి సాగునీటి కష్టాలు ఏర్పడతాయని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్ లను వెంటనే రద్దు చేయాలని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మానేరు వాగు పరివాహక రైతులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



# నిరంతర తాగునీటి సరఫరాకు కార్యాచరణ

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ప్రజాపక్షం/తిర్యాణి :** వేసవికాలం దృష్ట్యా జూన్ మాసాంతం వరకు నిరంతరాయంగా త్రాగునీటిని అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం తిర్యాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ శాఖ అధికారులతో కలిసి గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సహాయ ప్రాజెక్టు అధికారులు, ఇసిలు, క్షేత్రస్థాయి అధికారులతో త్రాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనుల నిర్వహణ, వడదెబ్బల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రజలందరికీ నిరంతర త్రాగునీటి సరఫరాకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు ప్రతి రోజు త్రాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తిర్యాణి మండలంలో 21 మారుమూల ప్రాంతాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. బోర్ వెల్‌లు, మిషన్ భగీరథ పథకం అందుబాటులో లేని ప్రాంతాలలో త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలన్నారు. వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఎండ వేడిని దృష్టిలో ఉంచుకుని ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న ఉదయం వేళల్లో పని చేసుకోవాలని తెలిపారు. వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా పాటించవలసిన జాగ్రత్తలు, వడదెబ్బ బాధితులు తీసుకోవలసిన చికిత్సలపై ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాలలో వేసవికాలం దృష్ట్యా ఉపాధి కూలీలు అస్వస్థతకు గురికాకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం తిర్యాని మండలంలోని మొర్లిగూడ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన కుటుంబానికి 100 రోజుల పని కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలని, వేసవికాలం అయినందున ఉపాధి హామీ కూలీలు అస్వస్థతకు గురికాకుండా పని ప్రదేశాలలో నీడ కొరకు షామియానా, త్రాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పి సురేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర మల్టి జోన్ 1 ఐజి రంగనాథ్ నిర్వహించిన, వీడియో కాన్ఫరెన్స్‌లో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి జిల్లా ఎస్పి కె. సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్నటువంటి చర్యలను పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంజాయితో పాటు ఇతర నిషేధిత మత్తు పదార్థాల మొక్కల పెంపకం, రవాణా చేయడం, స్వీకరించడం చేసే వారి పైన ప్రత్యేక నిఘా పెట్టాలని తెలియజేశారు. ప్రజలకు భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీస్ అధికారులకు తెలియజేశారు. నిషేధిత మత్తు పదార్థాల విషయంలో ప్రత్యేక దృష్టి కనబరచాలని తెలియజేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి (అడ్మిన్) ప్రభాకర్ రావు రావు , అసిఫాబాద్ డిఎస్‌పి సదయ్య, కాగజ్ నగర్ డిఎస్‌పి కరుణాకర్, సిఐలు, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

మజ్జిగ కేంద్రం ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/మంథని :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని, అదే మా లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంథని మున్సిపల్‌పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. మంథని ప్రజల దాహార్తిని తీర్చేలా మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంథని ప్రాంతంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఫిల్టర్ బెడ్‌ను పునరుద్ధిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ సురేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు శశిభూషన్‌కాచే, ముస్కుల సురేందర్‌రెడ్డి, గోటీకారి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# వసతులు కల్పించాలని రోడ్డెక్కిన విద్యార్థులు

మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి
మంథని కాటారం ప్రధాన రహదారిపై ధర్నా

**ప్రజాపక్షం/మంథని :** తాము చదువుకునే పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని, అనేక ఇబ్బందులతో కాలం వెల్లదీస్తున్నామని, వసతులు కల్పించాలని కోరుతూ విద్యార్థులు రోడ్డెక్కి ధర్నా చేపట్టిన సంఘటన మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వెంకటాపూర్ గ్రామంలో మహాత్మాజ్యోతిబాపూలే సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ విద్యా సంవత్సరం ముగుస్తున్న క్రమంలో కనీస సౌకర్యాలు లేవంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. పాఠశాల నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి మంథని కాటారం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. పాఠశాలలో సౌకర్యాలు లేవని, ప్రహరీ గోడ లేదని, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, పరీక్షలు సమీపిస్తున్నా ఇంకా సిలబస్ పూర్తి కాలేదంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు, వసతులు కల్పించకపోతే తాము ఎలా చదువు కోగలుగుతామని ప్రశ్నించారు. కాటారం మంథని ప్రధాన రహదారిపై విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న మంథని ఎస్ఐ వెంకటకృష్ణ హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నచ్చజెప్పి పాఠశాలకు తీసుకువచ్చి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపడంతో పాఠశాల రీజినల్ కోర్డినేటర్ గౌతంరెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇక్కడి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. అయితే వెంకటాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని కాటారం ప్రధాన రహదారి వరకు విద్యార్థులు నడిచి వెళ్లడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గురుకుల పాఠశాలకు వార్డెన్ ఉన్నప్పటికి విద్యార్థులు మూకుమ్మడిగా పాఠశాల నుంచి వెళ్లడం ఎలా సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమస్యలుంటే పాఠశాల ఆవరణలోనే ఆందోళన చేయాల్సి ఉండగా అటవీ ప్రాంతం మీదుగా అంతదూరంఎలా వెళ్లారని పలు పురుచర్చించుకుంటున్నారు. ఈ విషయంపై కూడా విచారణ చేస్తామని రీజినల్ కో ఆర్డినేటర్ గౌతంరెడ్డి తెలిపారు.



## సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే

జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్పి మాట్లాడారు.బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్ర మం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా సో మావారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్థి తగాదాల విషయం లో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా న డుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అం దించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పి తెలిపారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్ష

కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో గుర్తించిన తరువాతే ముందుకు వెళ్లాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టాల్సిన మరమ్మత్తు పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో నీటి పారుదల, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్, టిఎస్ఇడబ్ల్యుఐడిసి అధికారులు, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా కమిటీల ఏర్పాటు, జాతీయ బ్యాంక్‌లలో ఖాతాల ఓపెనింగ్ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసిన స్కూల్‌లలో విద్యుత్, తాగునీటి సరఫరా, టాయిలెట్‌ల మరమ్మత్తు ఇతర చేపట్టాల్సిన పనులను కమిటీ సభ్యులు, స్కూల్ హెచ్ఎం ఇతర అధికారులు కలిసి పరిశీలించాలని సూచించారు. అనంతరం ఆయా పనులను స్కూల్స్ ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జెడ్‌పి సిఇఒ ఉమారాణి, టిఎస్ఇడబ్ల్యుఐడిసి డిఇ అనిత సింగనాథ్, డిఇఒ రమేష్ కుమార్, డిఆర్‌డిఒ శేషాద్రి, ఇరిగేషన్ ఇఇ అమరేందర్ రెడ్డి, పిఆర్ ఇఇ సూర్య ప్రకాష్, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ సుందర్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# దళిత జాతి అభ్యున్నతికి కృషి చేస్తా

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎస్‌సి రిజర్వ్‌డ్ స్థానం నుండి ఎంఎల్ఏగా ఉన్న తాను దళిత జాతి అభ్యున్నతికి అన్ని విధాల కృషి చేస్తానని ధర్మపురి ఎంఎల్ఏ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో మాదిగ కుల బాంధవుల ఆధ్వర్యంలో సోమవారం అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గం నుండి ఎంఎల్ఏగా గెలుపొందడానికి తనకు ఆది నుండి అండగా నిలిచిన మాదిగ కుల బాంధవులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. గతంలో తాను జెడ్‌పి చైర్మన్‌గా ఉన్న సమయంలో జిల్లాలోని దళిత సర్పంచ్‌ల ద్వారా గ్రామాలలోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించిన విషయం గుర్తు చేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికై సిఎం రేవంత్‌రెడ్డిని ఇప్పటికే 15 సార్లు కలిసి విన్నవించానని అడ్లూరి తెలిపారు. తన ప్రాణం ఉన్నంత వరకు దళితులకు అండగా ఉంటానని తనను ఎంఎల్ఏగా కాకుండా ఒక సోదరుడిలా భావించి ఏ సమయంలోనైనా కలవవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు అడ్లూరిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్, నిర్వాహక బాధ్యులు చిలుముల లక్ష్మ ణ్, పారపెల్లి రాజమల్లయ్య, అరికిల్ల సతీష్, దీకొండ మహేందర్, మోకెనపెల్లి సతీష్, ముల్కల శ్రీనివాస్, ఎదుల్ల అంజయ్య, చందోలి శ్రీనివాస్, చెవులమద్ది రమేష్, వినోద్, రాయిల్ల రవికుమార్, లక్ష్మ ణ్, పోచన్న, కుమారస్వామి పాల్గొన్నారు.

## ప్రభుత్వం కచ్చితంగా రుణమాఫీ అమలు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తుందని ఇందులో భాగంగానే రైతు రుణమాఫీ అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్యాంక్ అధికారులతో చర్చలు జరుపుతున్నారని, తొందరలోనే రైతులకు తీపి కబురు అందుతుందని టిపిసిసి నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్‌లకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. గతంలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని దొంగ హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తరువాత రైతులను నట్టేట మోసం చేశారని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని రైతుల కోసం దర్నాలు చేస్తున్నట్లు కపట ప్రేమను చూపుతున్నారని అన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మాజీ జెట్పీటిసి సభ్యుడు ఎల్లాల జలపతి రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సేవాదళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లయ్య, భూమయ్య, ఆనంద్, రమేష్, రాజం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చిన్న హనుమాన్ జయంతి నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా



**ప్రజాపక్షం/కోరుట్ల:** కొండగట్టు హనుమాన్ దేవాలయంలో ఈనెల 22 నుండి 24 వరకు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా అన్ని ఏర్పాట్లతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిన్న హన్‌మాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు దేవాలయ ఆధ్వర్యంలో నిర్వహించాలని అన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు 7 స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీరు, శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహించాలని భక్తుల సౌకర్యార్థం లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయాలకు 14 కౌంటర్లు, కేశఖండన ప్రత్యేక దర్శన టికెట్ల 12 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ప్రాంగణం, రోడ్డు, ధర్మశాలలు, చుట్టు ప్రక్కల పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించడానికి అవసరమైన సిబ్బందిని విధులు నిర్వహిస్తారని, దేవాలయం లోపల బయట 64 సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చూడాలన్నారు. కరీంనగర్, వేములవాడ, వరంగల్, మంచిర్యాల, సిరిసిల్ల, హుజరాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి జగిత్యాల డిపోల నుండి భక్తుల సౌకర్యార్థం కొండగట్టుకు బస్సుల సౌకర్యాలను కల్పించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అధికారులు తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ దివాకర, అదనపు ఎస్పీ వినోద్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొడిమ్యాలలో పోలీసుల కవాతు



**ప్రజాపక్షం/కొడిమ్యాల:** ప్రజాస్వామ్య దేశంలో వచ్చే నెల మే 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత దేశంలోని ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలనే విధంగా స్వేచ్ఛ వాతావరణం నెలకోల్పేందుకు జగిత్యాల జిల్లా ఎస్పి సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలోని కొడిమ్యాల మండల కేంద్రంలో ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుండి వేంకటేశ్వర దేవాలయం వరకు కేంద్ర బలగాల పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డిఎస్‌పి రఘుచందర్ మాట్లాడుతూ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అందుకు గాను అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి భీంరావ్, మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్ఐ, ఎఆర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

